తెలుగులో
వెలువడుతున్న
ఏకైక హాస్య
మాస పత్రిక
24వ నవ్వుల వసంతం

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాసపత్రిక

ఏప్రిల్-2026 ₹25




ఒత్తిడి నివారణకు
నవ్వు!



# బంగార్తల్లి పురస్కారం-2026
## ప్రదానోత్సవం






హాస్యానందం సంపాదకులు-**శ్రీ పి.రాము,**
నెల్లూరు బాలభవన్ డైరెక్టర్- **శ్రీమతి గోవిందరాజుల సుభద్ర,**
నాట్యనిలయం,విజయవాడ, డైరెక్టర్- **శ్రీమతి స్వర్ణలత భారత,**
ఆం.ప్ర. కార్టూనిస్టుల సంఘం అధ్యక్షులు-**శ్రీ బాచి,** కథల పోటీ నిర్వాహకులు-**శ్రీ పాలపర్తి శ్రీకాంత శర్మ,**
హాస్యానందం ఆప్తులు- **శ్రీ కె.వి.వి.సత్యనారాయణ**
**సమక్షంలో బంగార్తల్లి పురస్కారం అందుకుంటున్న-**
**శ్రీమతి తోటకూరి లక్ష్మి.**




ఫొటోలు :ఫ్లాష్' రామారావు

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం

ఏప్రిల్-2026

24 వ సంవత్సరం ✦ 262 వ సంచిక

ముఖచిత్రం: ఆషికా రంగనాథ్
కార్టూన్: లేపాక్షి

సంవత్సర చందా-రూ.300/- | 2 సంవత్సరాల చందా-రూ.600/- | జీవిత చందా- రూ.5000/-

**Publisher& Editor-Ramu.P**

Editorial Office: **HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam, **YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist. Ph : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

**Full'Pillar** : Bnim

**Cartoon Feature Editor**: Bachi

**Creative Team**

Dr. K.Ramakrishna, Jaydev, Sarasi, Krishna, Nagisetty, Sangram, GopalKrishna, Bomman, Gandhi, Dayakar, Venkat, Kandlakunta SarathChandra Vadlamannati Gangadhar.

**D.T.P:**

P. Ramalakshmi, 9440304993

**Digital Media Director:**
Surya

**Well Wishers:**

Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Akshagna Vidya Venkat
Dr.V.V.Rama Kumar
Dr.Surepalli Vijaya

**Prize Sponsers**

K.V.V.Satyanarayana
Akshagna Publications
K.Sundaresayya & Satyavathi
*Cartonist* JSR
Md.Raj Mohammed
Nimmi Madhubala
A.V. Krishna Murthy

**Hyderabad & Secunderabad Distributor:**

M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad -01
**Ph: 9666680857, 6301072906.**



# ఎక్కడెక్కడ ఏమున్నాయి?...

## ఈ నెల ప్రత్యేకతలు


| | | |
|---|---|---|
| బంగారుతల్లి-2026 పురస్కార ప్రదానోత్సవం | | -7 |
| ఒత్తిడి నివారణకు-నవ్వు | -ఎ.దయాకర్ | -12 |
| నేస్తం, ఆకాసం నిర్వహించిన కార్టూన్ పోటీ విజేతలు | | -46 |


### కథలు


| | | |
|---|---|---|
| నిమిత్త మాత్రుడు | -గంగాధర్ వడ్లమన్నాటి | -20 |
| రిసెప్షన్ చేసుకో,అప్పు తీర్చుకో! | -బొందల నాగేశ్వరరావు | -28 |
| భలే మంచి చౌకబేరము! | - వడలి రాధాకృష్ణ | -32 |
| దొంగగారు | -'అభిమన్యు' | -36 |
| బోణీ రాజుగారి బోణీ | -'బామాశ్రీ' | -44 |


### శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -10 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -22 |
| స్మైల్‌స్టార్స్ | -దాస్ | -26 |
| ఇండియన్ ఇంక్ | - అశ్విని కుమార్ రథ్ & అబాని కుమార్ రథ్ | -30 |
| వెనక్కి వెళ్ళే కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -48 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |


### సీరియల్స్


| | | |
|---|---|---|
| కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -14 |
| సినిమా తీద్దామా? | -గొలుసు సీరియల్ | -40 |




### కార్టూన్ శీర్షికలు


| | | |
|---|---|---|
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -16 |
| హే భగవాన్ | -భగవాన్ | -18 |
| పంచ్ ఫ్రేమ్ | -కృష్ణ | -23 |
| బుడ్డోడు | -సుజయ్ కృష్ణ | -34 |
| నెల నెల నవ్వుల వెన్నెల | | -38 |
| రిటైర్డ్‌లైఫ్ | -బొమ్మన్ | -43 |
| ప్రొఫెషనల్ ఫన్ | -నాగిశెట్టి | -49 |














### ఈ సంచికలో కార్టూనిస్టులు

- సరసి
- యండమూరి
- బాచి
- శేఖర్
- బొమ్మన్
- గోపాలకృష్ణ
- కృష్ణ
- నాగిశెట్టి
- భగవాన్
- లేపాక్షి
- గాంధీ
- ప్రసిద్ధ
- మోహన్ కుమార్
- ఎస్.ఎస్.పి.రావు
- శర్మ
- సుజయ్‌కృష్ణ
- పి.పి.నాయుడు
- సునీల్
- చక్రవర్తి
- పద్మ
- రామ్‌శేషు
- గిరి
- టి.ఆర్.బాబు
- భాను
- ప్రసాద్ కాజ
- వై.శ్రీనివాసరావు
- బీవీఎస్
- దొరశ్రీ
- దాస్
- వందన శ్రీనివాస్
- తోపల్లి ఆనంద్
- శిరి
- అప్పాజీకృష్ణ
- ఓంకార్
- మణి
- అర్జున్
- వర్చస్వీ
- సురేష్
- షేక్ సుభాని
- మల్లేష్
- కన్నాజీరావు
- అరుణ్
- ఆనంద్ గుడి
- నూకాపతి
- శ్రీధర్
- కృష్ణశ్రీ
- బలరాం
- హరి

**గమనిక:**
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.




# హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు... సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

స్థాయి!... ఒక్కొక్కరిదీ ఒక్కో స్థాయి! ఒకరు ఉద్యోగంలో ఒక స్థాయి సంపాదిస్తే... మరొకరిది జనాలు 'ఇచ్చే' స్థాయి! అయితే వారి వారి స్థాయిలను బట్టి వారి 'ప్రవర్తన ఉంటుందా' అని ఒకసారి పరిశీలిద్దాం! కొంతమంది 'ఆఫీసర్'లు అంటే జనాల కోసం పని చేసే వాళ్ళు (ప్రభుత్వ) ఆ జనాలను ఎలా గౌరవిస్తుంటారో మనం గమనిస్తూనే ఉంటాం. వారికేదో సూపర్ పవర్ ఉన్నట్టు ప్రవర్తిస్తుంటారు. బాధాకరమైన విషయం ఏమిటంటే అది మన జీవితంలో 'మామూలే' అన్నట్టు మనం పట్టించుకోం! అదే వాళ్ళ ధైర్యం! ప్రశ్నించటం మొదలెడితే... కొంతలో కొంత అయినా ఫలితం దక్కుతుంది. ముఖ్యంగా కొంతమంది 'అధికారులు' ఏమైనా 'విచారణ' కోసం వెళితే... వారి ప్రవర్తన విచారకరంగా ఉంటుంది. వారు మన 'సేవ' కోసమే అక్కడుంటారు. కానీ వాళ్ళ ప్రవర్తన 'జీతం' కోసమే అన్నట్టుగా ఉన్నా... అక్కడ వారితో విభేదిస్తే ఎక్కడ మన పని 'అడ్డం' పడుతుందోననే భయం మనకి 'ఇది' అలవాటు చేసేసింది. వాళ్ళ జీతం.... జీవితం మన డబ్బుతోనే ముడిపడి ఉందనే సత్యం వాళ్ళు గ్రహిస్తే గానీ వాళ్ళలో మార్పు రాదు!

ఇక మన ప్రముఖులు! కొంతమంది వాళ్ళని 'ప్రముఖులను' చేసిన జనాలతో 'మీరెక్కడ?... మేమెక్కడా?' అనే 'స్థాయిలో' ఉంటుంది వాళ్ళ ప్రవర్తన. ఉదాహరణకి మనకు ఉదయం లేచిన దగ్గర్నుంచి 'నీతి వాక్యాలు' చెప్పే ఈ మహానుభావులకు వాళ్ళు చెప్పే 'ఆ' వాక్యాలు వాళ్ళకి వర్తించనట్లు ప్రవర్తించే వారి ప్రవర్తన ఎంతైనా శోచనీయం. మనం నమస్కారం చేసినా ప్రతి నమస్కారం చేయని ఇలాంటి సంస్కారం గల వాళ్ళు ఎలా గొప్పవాళ్ళు చెప్పండి?! మనల్ని కించ పరిచే ఈ మహానుభావుల్ని (నిజంగా మహానుభావులే) మనం దూరంగా ఉంచటమే మంచిది! ఎందుకంటే మన 'ఆత్మగౌరవం' కంటే ఏదీ గొప్పది కాదు! మన సంతోషం కంటే ఎవరూ మహానుభావులు కారు!

అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...






**✦ శ్రీలేఖ పి.ఎస్., సికింద్రాబాద్**

**సా**మెతలు-సందర్భాలు కార్టూన్లు అన్నీ బావున్నాయి. చాలా కాలం తరువాత యండమూరి వీరేంద్రనాథ్ కొత్త పుస్తకం (ఒక దెయ్యం తో నా ప్రేమ కథ) వచ్చింది మార్కెట్‌లోకీ. దాని గురించి చదివి ఆశ్చర్యపోయాము. ఆధునిక భావాలతో ముడిపడిన కథలు కూడా వ్రాయగలరని వారికీ విజ్ఞప్తి. స్మైల్‌స్మార్ట్‌లో హరిగారి గురించి ఎన్నో విషయాలు తెలుసుకున్నాం ... 1992 నుండి (34 సంవత్సరాల నుండి) వారి కార్టూన్లు ప్రచురిస్తున్నారు అని తెలిసి చకితులయ్యాము. వారి కార్టూన్లు అన్నీ అద్భుతంగా ఉన్నాయి. సింగిల్ పేజీ కథలు బావున్నాయి.

**✦ ఆర్.మనోహర్ కుమార్, కాకినాడ**

**మా**ర్చి సంచిక చాలా బావుంది. హాస్య కథలు వేటికవే బావున్నాయి. కార్టూన్ల పోటీలో బహుమతి పొందిన కార్టూన్లు చాలా బావున్నాయి. కథలకు వేసిన బొమ్మలు కూడా చాలా బావున్నాయి. పత్రిక నిర్వహణ పట్ల మీ శ్రద్ధ ప్రతి పేజీలో ప్రస్ఫుటమవుతుంది.

**✦ కె.రాజేశ్వరి, చెన్నై**

**మా**ర్చి సంచిక 'హాయ్ సానందంగా'లో స్త్రీలకు దక్కాల్సిన గౌరవం దక్కట్లేదు అన్న మీ మాటలు అక్షర సత్యం. వివిధ రంగాలలో సేవ (పని) చేస్తున్న మహిళలకు ప్రభుత్వపరంగా అవార్డులు ఇస్తే బాగుంటుంది. ఈ సంచికలో ప్రచురించిన 15 కథలు సూపర్. అలాగే కార్టూన్లు కూడా చాలా బావున్నాయి. ముఖ్యంగా 'సిగ్గు లేక పోతే' కార్టూన్లు కొత్తగా ఉన్నాయి. మీకు అభినందనలు.

**✦ చోడవరపు హనుమంతరావు, హైదరాబాద్**

**మా**ర్చి హాస్యానందం ముఖచిత్రం చాలా అందంగా, ఆకర్షణీయంగా ఉంది. ఈ సంచికలో కథలన్నీ అలరించాయి. ధన్యవాదాలు.

**✦ జె.రవిచంద్ర, బెంగళూరు**

**మా**ర్చి సంచికలో ప్రచురించిన 'గ్రహానుగ్రహాలు' చాలా బాగుంది. నిజంగా హాస్యప్రియత్వం ఉన్నవాళ్ళకే ఈ యోగం అన్న మీ మాటలు నిజం!... నేను మామూలుగా ఎందులో అయినా నా రాశి ఫలితాలు మాత్రమే చదువుతాను. కానీ ఇందులో అందరివీ చదివేసాను. రాశీవారిగా వేసిన బొమ్మలు కూడా చాలా బాగున్నాయి. నాగిశెట్టి గారికి అభినందనలు. ఇక పోటీలో బహుమతి గెలుచుకున్న కథలు, కార్టూన్లు బావున్నాయి. కథలు చూడగానే చదవాలనే మీ ప్రజంటేషన్‌కి అభినందనలు.



## ముళ్లపూడి సింగిల్ పేజీ హాస్య కథల పోటీ

**ప్రఖ్యాత రచయిత ముళ్లపూడి వెంకటరమణగారి పుట్టినరోజు జూన్,28 సందర్భంగా శ్రీ ఏ.వి.కృష్ణమూర్తి గారి సౌజన్యంతో ఎప్పట్లాగే హాస్యానందం ఈ పోటీని నిర్వహిస్తోంది.**



**ఎంచక్కా ప్రతి కథకు 1000 రూపాయలు చొప్పున పది బహుమతులు ఉంటాయి**

నిబంధనలు: మీ కథలు రాత ప్రతిలో రెండు పేజీలకు మించకూడదు.
తెలుగుతనం ఉట్టిపడేలా కథలు ఉండటమే కాదు...
నవ్వు కూడా రావాలండోయ్!

**కథలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ మే-10,2026.**
**కథలు ఈ మెయిల్‌కి పంపండి-**
**hasyanandampoteelu@gmail.com**



# బంగార్తల్లి-2026
## పురస్కార ప్రదానోత్సవం!

✦ **పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక మినీ హాస్య కథల పోటీలో విజేతలకు బహుమతి ప్రదానం**

✦ **NCCF వారు నిర్వహించిన కార్టూన్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానం.**

✦ 'సిగ్గు లేక పోతే' **అంశంతో నిర్వహించిన కార్టూన్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానం.**




**హా**స్యానందం పత్రిక వ్యవస్థాపక సంపాదకులు శ్రీ రాముపండాగారి మాతృమూర్తి-**దివ్యశ్రీ జంబువతి గారి** జయంతి సందర్భంగా ఏటా అందిస్తున్న **బంగార్తల్లి పురస్కార ప్రదానోత్సవం,** మార్చి,22వ తేదీన కె.బి.ఎన్ కళాశాల, విజయవాడ రీడింగ్ రూమ్‌లో వైభవంగా జరిగింది.

ఈ సభలో అతిథులుగా-

**శ్రీమతి గోవిందరాజుల సుభద్రా,** డైరెక్టర్, బాలభవన్, నెల్లూరు;

**శ్రీమతి స్వర్ణలత భారత,** డైరెక్టర్, నాట్యనిలయం, విజయవాడ;

**శ్రీఏవీఎమ్,** ప్రముఖ కార్టూనిస్టు;

**శ్రీబాచి,** అధ్యక్షులు, ఆం.ప్ర.కార్టూనిస్టుల సంఘం;

**శ్రీపాలపర్తి శ్రీకాంత శర్మ,** కథల పోటీ నిర్వాహకులు;

**శ్రీ కె.వి.వి.సత్యనారాయణ,** హాస్యానందం ఆప్తులు పాల్గొన్నారు.

చిరంజీవి సత్యశ్రీ నాట్య ప్రదర్శనతో సభ ప్రారంభమయింది.

బంగార్తల్లి పురస్కారం గురించి శ్రీమతి ప్రియాంక పరిచయం చేశారు.

'జన్మనిచ్చిన తల్లి పేరిట, తనకో గుర్తింపునిచ్చిన ప్రచురణరంగానికి సేవలు చేస్తున్న ఒక మహిళకు ప్రతియేడాది ఈ బంగార్తల్లి పురస్కారం అందిస్తున్నామ'ని హాస్యానందం రాము చెప్పారు.

గత ఇరవై ఏళ్ళుగా పుస్తక ప్రచురణ రంగంలో డి.టి.పి. చేస్తున్న **శ్రీమతి తోటకూరి లక్ష్మిగారికి ,** పదివేల రూపాయలు, జ్ఞాపిక, సన్మాన పత్రం, శాలువతో సత్కరించి, **బంగార్తల్లి పురస్కారం** ముఖ్యఅతిథుల చేతుల మీదుగా అందజేసారు.

ఈ సభలో... పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక **మినీ హాస్య కథల పోటీలో** విజేతలకు, 'సిగ్గు లేకపోతే' అంశంతో నిర్వహించిన **కార్టూన్ల పోటీలో** విజేతలకు మరియు ఎన్.సి.సి.ఎఫ్ **కార్టూన్ల పోటీలో** విజేతలకు బహుమతి ప్రదానం చేసారు.

ఎన్.సి.సి.ఎఫ్ సభ్యులయిన కార్టూనిస్టులు శ్రీయుతులు శర్మ, టి.ఆర్.బాబు, ప్రేమ్, వర్మ, భాను, రఘుగార్లు హాస్యానందం రాము గారికి, సత్కరించి అభినందనలు తెలియజేసారు.









ప్రముఖ కవి, రచయిత, కె.బి.ఎన్. కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణగారు సభని ఆద్యాంతం ఆహ్లాదంగా నిర్వహించారు.

హాస్యానందం ఏర్పాటు చేసిన విందు భోజనంతో కార్యక్రమం ముగిసింది.

**-ఆర్కే**










సిగ్గులేకపోతే...?! అంశంతో నిర్వహించిన కార్టూన్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానం.













## పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక మినీ హాస్య కథల పోటీలో విజేతలకు బహుమతి ప్రదానం











**NCCF నిర్వహించిన కార్టూన్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానం.**




హాస్యానందం ఎడిటర్,రాముగారిని సత్కరిస్తున్న ఎన్.సి.సి.ఎఫ్ సభ్యులు











## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**

నెలనెలా... ప్రతినెలా **4500రూపాయల బహుమతులు**



'కార్టూన్ మిత్ర'

**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**

**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**

బహుమతిగా ఇస్తున్నారు.








**శ్రీమతి నమ్మి మధుబాల**


**(బాపు) రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**


కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమతిగా **1000 రూపాయలు ఇస్తున్నారు.**

← మొదటి బహుమతి- **రూ.500/-లు**

↙ రెండవ బహుమతి- **రూ.300/-లు**


↓ మూడవ బహుమతి- **రూ.200/-లు**




**అక్షజ్ఞ పబ్లికేషన్స్ వారు**
**ఒకో కార్టూన్‌కి రూ.500/-లు**
**చొప్పున ఈ రెండు కార్టూన్లకు**
**1000 రూపాయలు**
బహుమతి ఇస్తున్నారు.


AKSHAGNA PUBLICATIONS





**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.




కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి **500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**ప్రతి నెలా హాస్యానందంకు వచ్చే**
**కార్టూన్లలోంచి 8 మంచి కార్టూన్లకు**
**బహుమతులు ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు!**

# ఒత్తిడి నివారణకు- నవ్వు

-ఏ.దయాకర్
Cartoonist & Animator

**నేటి ఆధునిక జీవితంలో ఒత్తిడి సాధారణం అయ్యింది... దీని నివారణకుఅద్భుతమైన ఔషధం -'నవ్వు'. అది శరీరంలో ఒత్తిడిని తగ్గించి, రోగనిరోధక శక్తిని పెంచి, హార్మోన్లను సమతుల్యం చేస్తుంది... సంబంధాలను బలపరుస్తుంది...మనసుకు బలాన్ని ఇస్తుంది... మెదడులోని నాడీ మార్గాలను చురుకుగా పని చేయిస్తుంది...సూటిగా చెప్పాలంటే- నవ్వు మనలో ఉన్న రక్షణ వ్యవస్థని మెరుగుపరచి, డాక్టర్ అవసరం లేకుండా చేస్తుంది. ఒక మంచి నవ్వు ఒత్తిడి నివారణ సాధనము అని చెప్పవచ్చు.**

మన పూర్వీకులు అడవి జంతువుల నుంచి రక్షించు కోవడం కోసం 'పోరాడు లేదా పారిపో...' అనే పద్ధతిని పాటించేవారు.

ఒకప్పుడు పులి దాడి చేస్తే... మనిషి శరీరం వెంటనే అడ్రినలిన్, కార్టిసోల్ అనే హార్మోన్లను విడుదల చేసి, జీర్ణక్రియ ప్రఘనం లాంటి అవసరం కాని పనులను ఆపి... మొత్తం శక్తిని కండరాలకు పంపి, ప్రమాదం తీరిన తర్వాత శరీరాన్ని మళ్లీ సాధారణ స్థితికి తెచ్చేది.

ఈ రోజు ఆ 'పులి' ఒక డెడ్‌లైన్, ట్రాఫిక్ జామ్, క్రెడిట్ కార్డు బిల్లు... ఇలా ఎన్నెన్నో!.. కానీ ఈ సమస్యలు మానసికమైనవి, ఎప్పుడూ ఉండేవి కావడంతో శరీరం మామూలు స్థితికి రావడం చాలా అరుదు. అందుకే మనం ఎప్పుడూ నరాలు తెగే ఉత్కంఠలోనే ఉంటాం. దీని వల్ల అధిక రక్తపోటు, రోగనిరోధక శక్తి తగ్గడం, ఆందోళన... ఎప్పుడు వెన్నంటే వుంటాయి.ఇలాంటి సమయంలో నవ్వు రంగప్రవేశం చేస్తే, ఒత్తిడిని పూర్తిగా తగ్గించి మన శరీరాన్ని విశ్రాంతి స్థితికి మార్చేస్తుంది.

**ఒత్తిడికి అతి పెద్ద శత్రువు**


దీర్ఘకాలిక ఒత్తిడి రోగనిరోధక శక్తిని తగ్గిస్తుంది. ఇది టీ-సెల్స్‌ను తయారు చేసే థైమస్ గ్రంథిని చిన్నదిగా చేస్తుంది. యాంటీబాడీల ఉత్పత్తినీ అడ్డుకుంటుంది. అందుకే ఎక్కువగా పనిచేసే సమయంలో మనం సులభంగా జబ్బు పడతాం.

నవ్వు మాత్రం శక్తివంతమైన రోగనిరోధకంగా పనిచేస్తుంది... లోమాలిండా యూనివర్సిటీకి చెందిన లీ బెర్క్ చేసిన పరిశోధనలో, నవ్వు నేచురల్ కిల్లర్ సెల్స్ క్రియాశీలతను పెంచుతుందని తేలింది. అదే కాకుండా, శ్వాసనాళ ఇన్ఫెక్షన్లతో పోరాడే ప్రత్యేక యాంటీబాడీల ఉత్పత్తినీ నవ్వు పెంచుతుంది. ఒత్తిడిని తగ్గించడం ద్వారా, రోగనిరోధక వ్యవస్థపై కార్టిసోల్ వేస్తున్న బ్రేక్‌ను నవ్వు తీసేస్తుంది. సూటిగా చెప్పాలంటే నవ్వు మనలో ఉన్న రక్షణ సైన్యాన్ని బలపరచి, డాక్టర్ అవసరం లేకుండా చేస్తుంది.

**నవ్వు నొప్పి నివారణ**

ఒత్తిడి మరియు నొప్పి ఒకదానితో ఒకటి... బలంగా కలిసిపోయి ఉంటాయి.

**నవ్వు శక్తివంతమైన రోగనిరోధకంగా పనిచేస్తుంది... లోమాలిండా యూనివర్సిటీకి చెందిన లీ బెర్క్ చేసిన పరిశోధనలో, నవ్వు నేచురల్ కిల్లర్ సెల్స్ క్రియాశీలతను పెంచుతుందని తేలింది. అదే కాకుండా, శ్వాసనాళ ఇన్ఫెక్షన్లతో పోరాడే ప్రత్యేక యాంటీబాడీల ఉత్పత్తినీ నవ్వు పెంచుతుంది. ఒత్తిడిని తగ్గించడం ద్వారా, రోగ నిరోధక వ్యవస్థపై కార్టిసోల్ వేస్తున్న బ్రేక్‌ను నవ్వు తీసేస్తుంది. సూటిగా చెప్పాలంటే నవ్వు మనలో ఉన్న రక్షణ సైన్యాన్ని బలపరచి, డాక్టర్ అవసరం లేకుండా చేస్తుంది.**





నొప్పి ఒత్తిడిని పెంచుతుంది. ఒత్తిడి కండరాలను బిగుసుకునేలా చేసి, నొప్పిని మరింత పెంచుతుంది. నవ్వు శక్తివంతమైన నొప్పి నివారకంలా పనిచేస్తుంది.

నవ్వినప్పుడు విడుదలయ్యే ఎండార్ఫిన్లు మూడ్‌ను మెరుగుపరచడమే కాకుండా... మెదడు మరియు స్పైనల్ కార్డ్‌కు వెళ్లే నొప్పి సంకేతాలను అడ్డుకుంటాయి.

ఒక మంచి నవ్వు ప్రభావం రెండు గంటల వరకు ఉండొచ్చు. దీర్ఘకాలికంగా నొప్పితో బాధపడేవారికి నవ్వు కొంతసేపు ఉపశమనం ఇస్తుంది. ఆ సమయంలో వారు బాగా నిద్ర పోగలరు, సులభంగా కదలగలరు, సానుకూలంగా ఆలోచించగలరు. ఇవన్నీ దీర్ఘ కాలికంగా కోలుకోవడానికి చాలా ఉపయోగపడుతుంది .

నవ్వు వ్యాధిని పూర్తిగా నయం చేయకపోయినా, దాని వల్ల కలిగే బాధను చాలా వరకు తగ్గిస్తుంది.

### మెదడులో జరిగే మార్పులు

నవ్వు ఒత్తిడిని ఎందుకు తగ్గిస్తుందో తెలుసుకోవాలంటే మెదడులోకి చూడాలి. నవ్వు అనేది మెదడంతా కలిసి చేసే పని అని చెప్పవచ్చు. అందులో జోక్ అర్థం చేసుకునే భాగం, భావోద్వేగాల భాగం, శరీరాన్ని కదిలించే భాగం. ఇలా అన్నీకలిసి పనిచేస్తాయిని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి

### ఒత్తిడి హార్మోన్లు తగ్గడం

నవ్విన వెంటనే జరిగే ముఖ్యమైన మార్పు హార్మోన్లలో ఉంటుంది. నవ్వినప్పుడు మెదడు కార్టిసోల్, అడ్రినలిన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. ఇవే ప్రధాన ఒత్తిడి హార్మోన్లు. కార్టిసోల్ ఎక్కువ కాలం ఎక్కువగా ఉంటే, మెదడు కణాలకు హాని చేస్తుంది, పొట్ట చుట్టూ కొవ్వు పెరుగుతుంది, రక్తపోటు పెరుగుతుంది.

పరిశోధనలు ఏం చెబుతున్నాయంటే... నవ్వు రాబోతోందనే ఊహ మాత్రమే కూడా ఈ హార్మోన్లను తగ్గిస్తుంది. లోమాలిండా యూనివర్సిటీ చేసిన ఒక అధ్యయనంలో... సరదా వీడియో చూడబోతున్నామనే ఆలోచనతోనే ఒత్తిడి హార్మోన్లు దాదాపు 40 శాతం తగ్గాయిని.నిజంగా నవ్వడం మొదలైన తర్వాత ఇంకా ఎక్కువగా తగ్గాయిని వెల్లడించారు.

### 'సంతోష హార్మోన్లు' విడుదల

నవ్వుచెడును తగ్గించడమే కాదు, మంచిని పెంచుతుంది.

ఇది నాలుగు ముఖ్యమైన రసాయనాలను విడుదల చేస్తుంది.

**ఎండార్ఫిన్లు:**ఇవి శరీరానికి సహజమైన నొప్పి నివారకాలు. నవ్వినప్పుడు ఇవి విడుదలై, మంచి అనుభూతిని కలిగిస్తాయి.

**డోపమిన్:** ఆనందం, ప్రేరణకు సంబంధించిన రసాయనం. మంచి నవ్వు డోపమిన్‌ను విడుదల చేసి, ప్రతికూల ఆలోచనల చక్రాన్ని ఆపేస్తుంది.

**సెరోటోనిన్:**మూడ్, నిద్ర, ఆకలిని నియంత్రించే రసాయనం. నవ్వు దీన్ని పెంచి, మనసును స్థిరంగా ఉంచుతుంది.

**ఆక్సిటోసిన్:** ఇది బంధాన్ని పెంచే హార్మోన్. ఇతరులతో కలిసి నవ్వినప్పుడు ఇది విడుదలై, ఒంటరితనం, భయాన్ని తగ్గిస్తుంది.

### మెదడు తరంగాల్లో మార్పు

నవ్వినప్పుడు మెదడు తరంగాలు 'గామా' స్థితికి మారుతాయి. ఇది స్పష్టమైన ఆలోచనలను, మంచి జ్ఞాపకశక్తితో సంబంధం కలిగి ఉంటుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు మెదడు అస్తవ్యస్తంగా పనిచేస్తుంది. నవ్వు మెదడును సమన్వయం చేసి, నవ్వు ఆగిన తర్వాత కూడా... కొంతసేపు ప్రశాంతతను, ఏకాగ్రతను ఇస్తుంది.

### దృష్టికోణంలో మార్పు

ఒత్తిడి ఎక్కువగా 'టన్నెల్ విజన్' వల్ల వస్తుంది. అంటే సమస్య తప్ప ఇంకేమీ కనిపించక పోవడం. మన దృష్టి మొత్తం భయంపైనే నిలిచిపోతుంది. హాస్యం మాత్రం దృష్టికోణాన్ని మార్చుతుంది.

నవ్వు ఇలాంటి పరిస్థితిని ఇంకో కోణంలో చూడమని మనసును ప్రోత్సహిస్తుంది. అప్పుడు ఊహించని మలుపుకు కారణం హాస్యం అవుతుంది.

నవ్వును అలవాటు చేసుకుంటే, మన ఆలోచనల్లో మార్పు పెరుగుతుంది. కష్టమైన పరిస్థితిలో కూడా నవ్వగలిగితే, మనం ఆ పరిస్థితి నుంచి కొంచెం దూరంగా నిలబడి చూడగలుగుతాం. అప్పుడు మనం ఆ సమస్యకు బలైన వ్యక్తిలా కాకుండా, దానిని గమనిస్తున్న వ్యక్తిలా మారతాం.

దీన్నే 'డిటాచ్డ్ కన్సర్న్' అంటారు. సమస్యపై శ్రద్ధ పెట్టవచ్చు, కానీ దానిలో మునిగి పోవాల్సిన అవసరం లేదు.





కథ-కథనం


యండమూరి వీరేంద్రనాథ్
యర్రంశెట్టి శాయి





# కొంగుచాటు కృష్ణుడు

**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. సరస్వతి సృష్టించిన రెండో వాడు గూటాలపల్లి ఆనందరావు, అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం అతడి చెడుగుణం. మూడోవాడు సాత్వికరావు, పరమ సాత్వికుడు! సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. సాత్వికరావు ఆత్మహత్య ప్రయత్నంలో లలిత దగ్గరకు చేరతాడు. ఆనందరావు రాధని పెళ్ళి చేసుకోవాలనే తలంపుతో ప్లాన్లు వేస్తునే క్రమంలో...**ఆ తర్వాత...**



**"అలా అన్నానా?... అయితే అది మొదటి సంవత్సరం అయి ఉంటుంది."**

**"రెండో సంవత్సరం?..."**

**"ప్రేమించుకున్నాం."**

**ఈసారి రాధ అతడి చెంప ఛెళ్ళుమనేలా కొట్టింది.**

**"ఏమిటోయ్? దోమలు మరీ ఎక్కువవుతున్నట్లున్నాయి..." అన్నాడు కల్నల్.**

**"లైటు లేదు కదండీ... అందుకని చేరో వైపూ ఆడదోమలు విజృంభిస్తున్నాయి!" అన్నాడు ఆనందరావు ఇద్దరి చేతులకీ కొంచెం దూరంగా వెళ్ళి.**

**"అమ్మాయ్! వీడేదో సెకండ్ హ్యాండ్ వ్యవహారం లాగున్నాడు!" అన్నాడు వీరభద్రరావ్ చిరాగ్గా.**

**"...పెళ్ళాల్ని శనివారం సాయంత్రం మార్కెట్లో వెతుక్కునే బాపతు వీళ్ళు. నీలాంటి వారికి తగరు. ఏమంటావు?"**

**ఆనందరావు శబ్దం కాకుండా జయలక్ష్మి నిలుచున్న చోటికి చేరుకున్నాడు.**

చటుక్కున ఆమె నోరు మూసి, బలంగా మెట్ల పైకి లాక్కెళ్ళాడు.

లోపలికి వెళ్ళగానే తలుపులు మూసి చటుక్కున చేతులు పట్టుకుని, "బాబ్బాబు! ఇప్పుడేం గొడవ చేయకు. అవతల పెద్ద మనుషులున్నారు." అన్నాడు బ్రతిమాలుతూ.

"ఆ అమ్మాయి ఎవరు?"

"నా ఫ్రెండ్. మొన్నే ఫ్రెండ్‌షిప్ అయింది."

"మొన్న ఫ్రెండ్-షిప్ అయింది. ఈ రోజు రాత్రి షిప్ ఇంటికి వచ్చింది. రేపు హార్బర్‌కి చేరుకుంటుంది."

"ఛా!ఛా!! నువ్వుండగా నా లంగరుకి ఇంకో హార్బర్ ఎందుకు లక్ష్మీ?"

"అలాగా! మరి ఆ అమ్మాయి దగ్గర నేను పని మనిషిననీ, ఎప్పుడో త్యాగాలు చేసి చచ్చిపోయాననీ ఎందుకు అబద్ధాలు చెప్పినట్టో?"

"అదా? అదీ... అలా చెప్పటానికి ఓ భయంకరమైన కారణం ఉంది లక్ష్మీ. మనసు పొరల్లో అగ్నిపర్వతాల్ని బ్రద్దలు చేసే ఆ కారణాలు ఏమిటి!?... అని దయచేసి అడగకు!"

"ఏవిఁటా కారణాలు?"

"ఇంకా ఆలోచించలేదు..."

"ఏవిఁటీ?"

"సారీ... అదే... ప్రస్తుతం నేనున్న పరిస్థితుల్లో దాన్ని బయటకు చెప్పలేను." బిస్కెట్ కోసం డ్రాయర్ జేబులో వెతుక్కుంటూ అన్నాడు.

"నమ్మమంటావా నీ మాటలు?"

"ప్రస్తుతం నమ్మక తప్పదు. ఇప్పుడో అతి ముఖ్యమయిన సమస్య పరిష్కారం కాబోతూంది. అంచేత అది తేలేవరకూ నువ్వు పైనే ఉండాలి."

జయలక్ష్మి ఓ క్షణం ఆలోచించి... "సరే! ఆ పనేదో

త్వరగా పూర్తి చేసుకురా. నేను నీతో చాలా ముఖ్యమయిన విషయాలు మాట్లాడాలి" అంది.

"ఓ అరగంటలో సెటిల్ చేసుకొస్తా!" అంటూ హడావిడిగా కిందకు పరిగెత్తాడు.

రాధ అప్పుడే మెట్లు ఎక్కుతోంది.

"మేడ మీద ఏం చేస్తున్నావు?" అడిగింది.

"టార్చిలైటు కోసం వెతుకుతున్నాను" మెట్లు దిగుతూ అన్నాడు.

"వెతుకుతూ ఎవరితో మాట్లాడుతున్నావు?"

"నాలో నేనే మాట్లాడుకుంటున్నాను. నాలోనే ఇద్దరున్నారు. వారు ఎప్పుడూ ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ ఉంటారు. ఇద్దరు ఆడవాళ్లు వీధి కొళాయి దగ్గర కొట్టుకున్నట్టు నాలో ఉన్న ఆ ఇద్దరూ అప్పుడప్పుడు ఒకరితో ఒకరు దెబ్బలాడుకుంటారు. దాన్నే ఇంట్రాస్పెక్షన్... ఆత్మ విమర్శ అంటారు".

వీరభద్రరావు అతని వైపు అనుమానంగా చూసి, కూతురి వైపు తిరిగి...

"అమ్మాయ్! వీడికేమయినా పిచ్చి ఉందా? ఇలాంటివి ముందే చెక్ చేసుకోవటం మంచిది. ఆ పనిమనిషిని కాసేపు 'ఇలవేలుపు' అంటాడు. కాసేపు 'ప్రేమించుకున్నాం' అంటాడు".

"లేదు డాడీ. సాత్విక్ కొంచెం అతితెలివిగా మాట్లాడుతాడు గానీ చాలా మంచివాడు. బ్యాంకులో తన పని తాను మర్యాదగా చేసుకునేవాడు." అంది రాధ.

రామస్వామి అనుమానంగా "బ్యాంకు ఏమిటి?" అన్నాడు.

ఆ సమయానికి జయలక్ష్మి ఒక్కొక్క మెట్టే దిగి...

"అయినా అమ్మాయిగారూ. ఇదివరకో అమ్మాయితో కాపురం చేసిన మనిషితో మీకు మళ్ళీ పెళ్ళేమిటి?" అనడిగింది.

"కాపురమా?"


"అవునమ్మగారూ! ప్రియురాలిని మొదట 'పనిమనిషి' అన్నాడు. దాని ఫోటో టేబుల్ మీద పెట్టి ఇలవేలుపు అన్నాడు. నాల్రోజులు పోయాక మీ ఫోటో టేబుల్ మీద కెక్కుతుంది. మీరు ఇలవేలుపు అయిపోతారు. మీరు పనిమనిషి అని మూడోదానికి చెప్తాడు. ఇలా



# నవ్వు కొమ్మచ్చి



సరసి




ఇలవేలుపులు పెరిగిపోతుంటాయి. ఫోటోలు మారిపోతుంటాయి.”

సరిగ్గా అప్పుడే గదిలో లైట్లు వెలిగాయి.

గది మధ్యలో తన కుర్చీలూ. వాల్ డెకరే షన్లూ చూస్తూ రామస్వామి ఉలిక్కిపడ్డాడు.

“ఓరి అప్రాచ్యుడా! మా ఇంట్లోని సోఫాలూ, అన్నీ తెచ్చి ఇక్కడ పెట్టావా?... ఎవర్నడిగి ముట్టుకున్నావురా అవి?”

ప్రాచ్యుడు అంటే ‘తూర్పు దేశానికి సంబంధించిన వాడు’ అని అర్థం. అప్రాచ్యుడు అంటే పశ్చిమానికి సంబంధించిన ‘మ్లేచ్ఛుడు’ అనే తిట్టు.

“అది కాదు రామస్వామిగారూ... మనం మనం ఒకటి కదా అని...”

రాధ కోపంగా వెళ్లి ఆనందరావు చెంప బ్రద్దలు కొట్టి తండ్రి దగ్గరకు నడిచి–

“పద డాడీ. పోదాం మనం!” అంది.

వీరభద్రరావు కదలలేదు.

“అప్పుడేనా? స్టాంపులు సేకరించినట్లు వీడు ఇలా ఇలవేల్పులను సేకరించకుండా మనం బుద్ధి చెప్పాలి కదా!” అన్నాడు.

“మనం చెప్పనవసరం లేదు లెండి. అంతా ఆ జయలక్ష్మే చూసుకుంటుంది” అంది రాధ.

“వీడు నా ఇంట్లో సామాన్లన్నీ కొట్టుకొచ్చి ఇక్కడ వాటి ఓనర్ లాగా ఫోజిస్తున్నాడని తెలీక వీడికి వత్తాసు పలికాను. నిజానికి వీడు తన ‘పనిమనిషీ... ఇలవేలుపూ...’ అని చెప్పిన ఈ అమ్మాయే వీడి ప్రియురాలు. ఆ అమ్మాయిని మోసం చేసి మీ అమ్మాయిని పెళ్ళి చేసుకొని కులకాలని అనుకున్నాడు.” అన్నాడు సిద్ధాంతి.

జయలక్ష్మి కల్పించుకుని– “కాదు” అన్నది.

“...అసలు విషయం నేను చెప్తాను. ఆనంద రావుకి క్యాన్సర్... ఇంకో నెల రోజులకన్నా ఎక్కువ బ్రతకడు. ఈ కాస్త సమయంలో వీలై నంత ఎక్కువమందితో పరిచయాలు పెంచుకోవాలని అతని ఉద్దేశం! అతడు స్వతహాగా చెడ్డ వాడు కాదు. ‘ఆత్మ న్యూనత తగ్గటం’ అంటే అమ్మాయిల నెంబరు పెరగటం – అనే ఆలోచన తప్ప మిగతా అంతా అతడితో ఒకే. ఎంతమంది అమ్మాయిల్ని గెలిస్తే అంత గొప్ప అనుకోవటం కొందరి మగవాళ్ళ బలహీనత. ఆ రోగంతో అతను బాధపడుతున్నాడు. భవిష్యత్తులో అతడు ఎవరినీ ఏమీ చేయడు..! చేయాలనుకున్నా చేయలేడు!”

ఆనందరావు కళ్ళు విస్ఫారితం చేసుకొని లక్ష్మి వైపు చూస్తూ ఉండిపోయాడు.

‘నేల చూపులు చూస్తూ, తల వంచుకొని కాలేజీలో అడుగు పెట్టే జయలక్ష్మేనా తన ఎదురుగా మాట్లాడుతోంది?’ అనిపించింది. నిండు కుండ తొణకదన్న సామెత ఎలా వచ్చిందో అర్థమైంది.

అతడు ఆ ఆలోచనల్లో ఉండగా, జయలక్ష్మి చేతులు జోడించి... “జీవితం చివరిరోజుల్లో ఉన్న అతన్ని క్షమించి వదిలేయండి..ప్లీజ్!” అంది.

క్షణం పాటు అక్కడ గాఢమైన నిశ్శబ్దం పేరుకుంది.

రాధ కూడా ఈ వాస్తవాన్ని తట్టుకోలేనట్టూ నిశ్చేష్టురాలై చూస్తూ ఉండిపోయింది.

అందరికన్నా ముందు తేరుకున్నది వీరభద్ర రావు.






“ఐ యాం సారీ సాత్విక్. ఈ విషయం తెలిసిన తర్వాత, నువ్వు చేసిన మోసాలన్నిటినీ క్షమించడానికి సిద్ధంగా ఉన్నాను!” అన్నాడు ఇంగ్లీషులో.

“మీ నిండు మనసుకు సాష్టాంగపడి నమస్కరించాలి సార్... నేను చేసింది తప్పే... క్షమించండి!”

వీరభద్రరావు లక్ష్మి వైపు తిరిగి– “ఇంకో నెల రోజుల్లో మరణిస్తాడు అని తెలిసి కూడా అతడిని వివాహం చేసుకుందాం అనుకుంటున్నావా లక్ష్మి?” అని అడిగాడు.

“ప్రేమించినప్పుడు అతని క్యాన్సర్ సంగతి తెలియదండి. ఆ తరువాత తెలిసింది. పెళ్లికి ముందు అపురూప సౌందర్యవతి అయిన భార్య, పెళ్లయిన తర్వాత మసూచి పోసి వికారంగా తయారవుతే భర్త వదిలేయడు కదండీ. నేనూ అంతే. అతడికి భార్య అవుదామనుకున్నాను. ఆ తరువాత చనిపోతాడని తెలిసింది. ఒకసారి ప్రేమించిన తర్వాత చనిపోతాడని తెలిసి వదిలేస్తే ఇక అదేమి ప్రేమండీ? అందుకే ఆఖరిరోజుల్లో అతనితో కలిసి ఉందామని నిర్ణయించుకున్నాను.”

ఆనందరావు కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

ఆమె అలా మాట్లాడుతుందని... అతడు ఊహించలేదు. ‘అమాయకురాలు. అతి సులభంగా వల్లో పడుతుంది... తన లిస్టులో మరో నెంబర్ పెరుగుతుంది.’ అనుకున్నాడు. తన ఆలోచనలు ఎంత నీచమో అతడికి అర్థమైంది. మనిషి మారటానికి గొప్ప గొప్ప మెలోడ్రమటిక్ సంఘటనలు అవసరం లేదు. సిద్ధాంతాలు పెళుసు అయినప్పుడు, నమ్మకాల భవంతులు కూలటానికి పెద్ద పెద్ద భూకంపాలు అవసరం లేదు.


అప్పటివరకూ ఉన్న అతడి నమ్మకాలు అలా కూలిపోయాయి.

మనసు జేబులోంచి బిస్కెట్ ప్యాకెట్ తీసి దూరంగా విసిరేశాడు.

“నిజంగా నువ్వు ఇలవేల్పువేనమ్మ... పనిమనిషివైనా... ఎంతో సంస్కారవంతమైన నిర్ణయం తీసుకున్నావు” అన్నాడు కల్నల్.

“నేను పనిమనిషిని కాదండి. మా నాన్న






రైల్వే టికెట్ కలెక్టర్. మా బాబాయ్ ఈ ఊర్లోనే ఒక పేరున్న రాజకీయ నాయకుడు"

అప్పటి వరకూ మౌనంగా ఉన్న రాధ... అడుగు ముందుకు వేసి...

"నాకు ఓ అనుమానం. ఒకవైపు సిద్ధాంతి గారూ, మరోవైపు జయలక్ష్మి, ఇద్దరూ నిన్ను 'ఆనందరావు' అంటున్నారేమిటి?..." అని అడిగింది.

"అవును. రాధగారూ మీకో శుభవార్త. నేను సాత్వికరావుని కాదు. నా పేరు ఆనందరావు. సాత్విక్ అచ్చు నాలా ఉండే మరో కుర్రోడు. బహుశ ఏదో బ్యాంకులో పని చేస్తాడు అనుకుంటాను. నాకు తెలిసినంతలో అతడి మీద నీళ్ళు పోసినా పాలుగా మారతాయి. అంత స్వచ్ఛమైనవాడు."

రాధ మొహం విప్పారింది.

మనసు తేలికైంది.

"అవును... నాకు అప్పుడే అనుమానం వచ్చింది. సాత్విక్‌కి సిగరెట్ వాసన కూడా పడదు. బహు నెమ్మదస్తుడు... 'ఇదేమిటి ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నాడు...' అనుకున్నాను." అంది.

ఏదో గుర్తొచ్చినట్టు కల్నల్ "ఇప్పుడు సాత్విక్ ఎక్కడున్నాడు? అతడిని వెంటనే చూడాలి. ఈ ఆనందరావులాగే అతడు కూడా మోసగాడా కాదా అన్నది నేను నిర్ణయించాలి." అన్నాడు.

"మీకు అనుమానం ఏమీ అక్కర్లేదు డాడీ... సాత్విక్ గురించి నాకు బాగా తెలుసు."

"నీకేంతెలుసు?... చిన్నపిల్లవి!... అందుకే ఆనందరావు వలలో పడ్డావు!" అన్నాడు రామస్వామి.

"నా కూతురు గురించి ఒక్క మాట తక్కువగా మాట్లాడితే నిన్ను రివాల్వర్తో షూట్ చేస్తాను." కోపంగా అన్నాడు కల్నల్.

"మాటిమాటికీ షూట్ చేస్తాను అనకండి సార్. మీ జేబులో రివాల్వర్ లేదని మాకు తెలుసు!" అన్నాడు ఆనందరావు.

"నీకెలా తెలుసు?"

"ఆ మాత్రం తెలీదా? రివాల్వర్ ఉంటే జేబు ఎత్తుగా ఉంటుంది."

ఆ మాటలకి సిద్ధాంతి ఫక్కున నవ్వాడు.

కల్నల్ అతని వైపు తిరిగి– "ఎందుకు నవ్వుతున్నావు?" అని కోపంగా ప్రశ్నించాడు.

"ఇదేదో సినిమా డైలాగు! ఆ సినిమా నేను చూశాను."

"మీరిలాంటి సినిమాలు కూడా చూస్తారా సిద్ధాంతి గారూ?" అడిగింది రాధ.

"మీరందరూ అనవసర ప్రసంగాలు ఆపి జరగాల్సిన విషయం చర్చించండి. ఇప్పుడు రాధ మోసపోయింది. ఆ సాత్విక్ వల్ల నేను కూడా అలా మోసపోకుండా ఉండాలీ అంటే, భవిష్యత్తులో నాక్కాబోయే మరిదిని చూడాలి. అతనిప్పుడు ఎక్కడ దొరుకుతాడు?" అంది జయలక్ష్మి.

"సాత్విక్ ఫోన్ నెంబర్ నా దగ్గర ఉంది." అని రాధ.

"ఇవ్వండి. నేను వెళ్లి అతనికి ఫోన్ చేసి రమ్మంటాను." అన్నాడు ఆనందరావు.

"వెంటనే వెళ్లి ఆ పని చెయ్యి... అతడిని నేను పరిశీలించాలి!" గంభీరంగా చెప్పాడు వీరభద్రరావు.

"తప్పకుండా సార్!... దానికి వీలుగానే రమ్మంటాను."

"వెధవ జోకులు ఆపి వెంటనే అతన్ని తీసుకురా!" **(సశేషం)**



## హాస్యానందం అభినందనలు
Congratulations

తెలుగు నూతన సంవత్సరంలో
మన కార్టూనిస్టులకు
ప్రత్యేక గౌరవ, మర్యాదలు దక్కడం
హర్షించదగ్గ విషయం.
ఈ ముగ్గురు కార్టూనిస్టులకు
హాస్యానందం అభినందనలు
తెలుపుతోంది.



ఉగాది సందర్భంగా అమరావతిలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ప్రముఖ కార్టూనిస్ట్ శేఖర్‌కు ప్రతిష్మాత్మక ఉగాది పురస్కారం ప్రదానం చేయబడింది. 'ఉగాది పురస్కారం అందుకోవడం గౌరవంగా భావిస్తున్నానని, భవిష్యత్తులో కూడా సమాజానికి ఉపయోగపడే విధంగా తన కార్టూన్ల ద్వారా సందేశాలను అందిస్తానని' శేఖర్ తెలిపారు.




**కిన్నెర** ఆర్ట్ థియేటర్స్, హైదరాబాద్ వారు ఈ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా 20వ తేదీన హైదరాబాదు రవీంద్రభారతిలో ప్రఖ్యాత కార్టూనిస్టు, చిత్రకారులు–**కీ.శే. చంద్ర గారి స్మారక పురస్కారాన్ని** మన కార్టూనిస్టు **శ్రీసరసి గారికి అందజేశారు.** సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎన్.వి.రమణ, తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారు డా. కె.వి.రమణ, ఐఏఎస్ (రి) గార్ల చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేయబడింది.

**ప**రాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలలో భాగంగా గుంటూరు రెవెన్యూ కళ్యాణ మండపంలో, తాడేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులు **డాక్టర్ రావెళ్ళ శ్రీనివాసరావు గారు** గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా గారి నుండి **ఉగాది పురస్కారం** అందుకున్నారు. జాయింట్ కలెక్టర్ అషుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు నగర కమీషనర్ మయూర్ అశోక్, డి.ఆర్.ఓ ఖజావలి, జిల్లా అధికారులు రావెళ్ళ గారిని ఘనంగా సత్కరించారు.





గంగాధర్ వడ్లమన్నాటి,9908445969

# నిమిత్త మాత్రుడు!

**విజిల్ వేసుకుంటూ, సోఫాలో కాళ్ళూపుతూ కూర్చున్న మధుకి, లలిత టీ అందిస్తూ...**

**"రేపు మా అక్కయ్య వస్తోంది." చెప్పి చెప్పగానే...**

**"మీ...మీ అక్కయ్య వస్తోందా?" అని పొలమారినట్టు దగ్గుతూ, చొక్కా మీద వేడి టీ ఒంపేసుకుని– "అయ్యో! నా పొట్ట కాలిపోయింది... ఉఫ్... ఉఫ్..." అంటూ ఊదు కుంటూ, బాధకి చొక్కాతో కళ్ళు తుడుచుకున్నాడు.**

లలిత కూడా కాస్త కంగారుగా, "అబ్బా! ఏవిటండీ మీ తొందర! టీని టీపాయ్ మీద పెట్టి, తీరిగ్గా కావాల్సినంత సేపు దగ్గుకోవచ్చు కదా? ఇప్పుడు చూడండి, బంగారం లాంటి కప్పు పగిలిపోయింది." అంటూ పక్కన ఉన్న టవల్‌తో తుడిచి... "చొక్కా తీసేయండి!" అని పక్కన ఉన్న పౌడర్ వేసి... "చల్లగా ఉంటుంది!" అని ఏ.సి. కూడా ఆన్ చేసి, ఆ పగిలిన కప్పుని బాధగా వంటగదిలోకి తీసుకుపోయింది.

లలిత ఇలా లోపలికి వెళ్ళగానే... 'దీని పీత బుర్రతో వేగలేకపోతు న్నాను.' అనుకుంటూ కాస్త భయంగా అటూ ఇటూ చూస్తూ, వాళ్ళక్క వస్తుందంటే, నా ఆనందం ముక్కలుచెక్కలై, నాకు చుక్కలు కనిపించే కాలం దాపురించి, అరటిపండులాంటి నా జీవితం, అరటితొక్క అవ బోతుందని అర్థం. ఆమె వచ్చిన ప్రతిసారీ... లలితకీ నాకూ మధ్య గొడవలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూనే ఉంటాయి. దాంతో ఇల్లు కల్లు కాంపౌండ్ అయిపోతోంది. ఆమె ఉండేది ఒకటి రెండు రోజులే అయినా, నెల గొడవలకి సరిపడా పిత్రీలు చెప్పేసి, నా మీదకి ఉసిగొల్పి వెళ్ళిపోతుంది. దాంతో లలిత ఆమె చెప్పుడు మాటల ప్రభావం నుండి బయటపడ్డానికి టూ, త్రీ వీక్స్ పడుతుంది. ఆ రోజుల్లో నేను మెంటల్‌గా వీకయిపోయి, భయంతో షేకయిపోతున్నాను. కాబట్టి ఇప్పుడు ఏం చేసి ఈ సమస్య నుండి బయటపడాలి రా దేవుడా... అనుకుంటూ అయోమయంగా బుర్రగొక్కున్నాడు.

తర్వాత ఏదో తట్టినట్టు, ఒక పని చేద్దాం, లలిత ఎప్పటినుండో కాశ్మీర్‌లో కాశ్మీర్ యాపిల్ తినాలని నా బుర్ర తినేస్తోంది. వాళ్ళ అక్క వచ్చేది రేపే కాబట్టి. కాశ్మీర్ విహారయాత్రకు రేపే తీసుకు వెళితే వాళ్ళక్కని మా ఇంటికి రాకుండా చేయొచ్చు అనుకుని...

"లలితా!" అంటూ పిలిచాడు మధు.

ఆ అరుపు విని, హాల్లోకి పరుగున వస్తూనే... "ఏమైందండీ? బాగా కాలిందా, మంటగా ఉందా? ఐసుముక్కలు తెచ్చి పొట్ట మీద పెట్ట మంటారా?" అడిగింది కంగారుగా.

'ఆ కాలిన గాయం గురించి కాదు. కాలబోయే గాయం గురించి' అని మనసులో అనుకుని... "అది కాదు లల్లీ! నువ్ ఎప్పటినుండో కాశ్మీర్ విహార యాత్రకి వెళ్దాం అంటున్నావ్ కదా? నాకు ఆఫీసులో ఓ రెండ్రోజులు సెలవు దొరికేలా ఉంది. వెళ్దాం అంటే చెప్పు! ఫ్లయిట్‌లో వెళ్ళి వచ్చేద్దాం!" అన్నాడు.

"ఫ్లైటులోనా? అంత డబ్బు ఒకేసారి ఖర్చుపెట్టేస్తే, మరి మిగతా ఖర్చులకో..." అడిగింది.

"ఫుట్‌పాత్‌ల మీద ఫ్లూటు ఊది సంపాదిస్తాను. అవన్నీ మర్చిపో... మనం మాత్రం ఫ్లైటులోనే వెళ్దాం." అన్నాడు


"నిజంగానా?!" అని ఎగిరి గంతేసి... "ఒక్క నిమిషం!" అని రెండు నిమిషాల పాటు బెడ్రూంలోకి వెళ్లొచ్చి... "చేసేయండి! రేపు మార్నింగ్ ఫ్లయిట్ అయితే మేలు. నాకు టిఫిన్ చేసే బాధ తప్పుతుంది. మూడు టికెట్లు చేయండి!" అంది ఉత్సాహంతో ఊగిపోతూ.

"అయితే సరే..." అని ఫోన్లో టికెట్స్ బుక్ చేయబోతూ ఆగి...బుర్ర గోక్కుని– "మనిద్దరమేగా వెళ్ళేది. మూడో టికెట్ ఎవరికి?" అడిగాడు అయోమయంగా.

"ఇంకెవరికీ? మా అక్కకి!... అసలే మొగుడ్ని వదిలేసిన సంతోషంలో ఉంది... రేపు పొద్దున మనింటికి వస్తుందిగా, మా అక్క కూడా కాశ్మీర్ ఎప్పుడూ చూడలేదట. తీసుకు వెళ్దాం!" అంది.

'చచ్చింది గొర్రె! ఆ మంచుకొండల్ని చూడ్డానికి వెళ్తూ, ఈ కంచుకొండని వెంటబెట్టుకెళ్ళలేను. ఆవిడ్ని కూడా తీసుకు వెళితే, ఫ్లయిట్ చార్జీల మాట అటుంచితే... నా మనశ్శాంతి మట్టికరు స్తుంది. ఇప్పుడెలా?' అనుకుంటుండగానే... ఏదో ఫోన్ రాగానే... "హాఁ! ఒకే సార్! అవసరమైతే పిలుస్తారా? సెలవు తీసుకున్నా లోకల్‌లోనే ఉండా లంటారా? సరే సార్!..." అని ఫోన్ పెట్టేశాడు.


లలిత ఉసూరుమంటూ లోనికి వెళ్లిపోయింది.



మళ్ళీ రింగ్ రావడంతో ఫోన్ ఎత్తాడు మధు– "ఏం(ట్రా సంబంధం లేకుండా ఏదేదో మాట్లాడేసి పెట్టేశావ్?" అడిగాడు గిరి.

మధు విషయం చెప్పడంతో... "మరీ ఆవిడని నువ్వు ఎక్కువ అపార్థం చేసుకుంటున్నావేమో అనిపిస్తోంది నాకు." అన్నాడు.

"ఎక్కువా?! ఆవిడ మొన్న వచ్చి వెళ్ళాక, నా ఫోన్‌కి పాస్‌వర్డ్ ఉంటే, రహస్యాలు ఉన్నట్టే అని నా భార్య పోరడంతో, పాస్వర్డ్ తీసేశాను. ఆఫీసుకే వెళ్తున్నానా లేక ఇంకెక్కడికైనా వెళ్తున్నానా అని అనుమానపడి, నా లొకేషన్ ట్రాక్ చేస్తోంది, సరే అనుకున్నాను... ఎక్కడికైనా అలా ఫ్రెండ్స్‌తో వెళితే, సడన్‌గా వీడియోకాల్ చేస్తుంది. ఎత్తితే, ఫోన్ చుట్టూ తిప్పి చూపించమంటుంది. లంచ్ బాక్స్ సరిగా తినకపోతే, వేరే ఎవరి దగ్గరైనా తినడం మరిగారా అని అనుమానిస్తోంది... ఇలాగే వాళ్ళక్క వచ్చి వెళ్ళిన ప్రతిసారి ఏవేవో కొత్త కొత్త పోకడలు మొదలు పెడుతుంది. పెళ్ళైన ఈ సంవత్సరన్నరలో, లలిత వాళ్ళక్క రెండుసార్లే వచ్చినా...



ప్రపంచం అంచులకి పారిపోవాలనిపించేంత విరక్తి కలిగించింది... ఆమె వచ్చిన ప్రతిసారీ, గంగలాంటి మా ఆవిడని చంద్రముఖిని చేస్తోంది. ఆమె వెళ్ళిన కొన్నివారాల తర్వాత గానీ నా భార్య మామూలు మనిషి కాదు. ఇపుడామె వచ్చి వెళ్తే, మా ఆవిడ ఈసారి ఏ భాగమతో, అరుంధతో అయిపోతుందని భయంగా ఉంది... సరే మళ్ళీ చేస్తాను." అంటూ ఫోన్ పెట్టేశాడు మధు.

అంతలోనే మళ్ళీ ఏదో ఐడియా వచ్చినట్టు, 'యెస్! ఆమె వచ్చే ఆ ఒక్కరోజో, రెండ్రోజులో, నేను ఆఫీసుకి సెలవు పెట్టి, ఇంట్లోనే ఉండి... వాళ్ళు బయటికి వెళితే, వాళ్లతో తిరిగి...ఆమె నా భార్యకి ఏవీ నూరి పోయకుండా చూడాలి... పోసినా సమస్య తీవ్రత చాలా వరకూ తగ్గించొచ్చు' అనుకుని కొంచెం కుదుట పడ్డాడు.

అనుకున్నట్టే, ఆమె వచ్చాక, భార్యని ఎక్కడా ఆమెతో ఎక్కువసేపు విడిచి పెట్టలేదు. ఎక్కువ సమయం వాళ్ళిద్దరూ ఒంటరిగా ఉండడానికి అతను తావివ్వలేదు. దాంతో అతను అనుకున్నట్టే అంతా సజావుగానే జరిగింది. ఆమె మర్నాడు సాయంత్రం, బస్సుకి టైమ్ అవుతుండడంతో ఆటోలో వెళ్లిపోయింది.

దాంతో మధు హాయిగా, ప్రశాంతంగా ఊపిరిపీల్చుకున్నాడు.

ఇంట్లోకి వచ్చి, సోఫాలో కూలబడ్డాడు, విజిల్ వేసుకుంటూ, సోఫాలో కాళ్ళూపుతూ కూర్చున్న మధుకి, కొంతసేపు తర్వాత లలిత టీ అందించింది.

ఇంతలో లలిత వాళ్ళ అక్క చేతికి కట్టుతో గుమ్మంలోకి అడుగుపెట్టింది. ఆమెని చూస్తూనే కళ్ళు తేలేసి, కొయ్యబొమ్మలా బిగుసుకు పోయాడు మధు.

లలిత కాస్త కంగారుగా–

"ఏమైందక్కా?" అంటూ ఆమెని జాగ్రత్తగా సోఫాలో కూర్చోబెట్టింది.

"నేను ఎక్కిన ఆ ఆటోని ఓ కారు గుద్దడంతో నా చేతికి ఓ మోస్తరు దెబ్బ తగిలింది. అక్కడే దగ్గరలో ఉన్న ఓ హాస్పిటల్లో ట్రీట్మెంట్ తీసుకున్నాను. ఒక వారం పాటు రెస్ట్ తీసుకుంటే సరిపోతుందని డాక్టర్ చెప్పాడు. కనుక వారం ఉండి వెళ్తానమ్మా!" ఆమె చెప్పడంతోనే మధుకి ఊపిరాగినంత పనైె... 'మళ్ళీ ఈ వారం రోజుల అగ్ని పరీక్ష ఏవిట్రా దేవుడా!' అని నీరసపడిపోయి, మనందరం నిమిత్తమాత్రులం... ప్రయత్నం మాత్రమే మన చేతుల్లో ఉంది!' తనలో తానే అనుకుంటుండగానే... పొలమారడంతో 'భొక్కుమ్ భొక్కుమ్' అని దగ్గుతూ, చొక్కా మీద వేడి టీ ఒంపేసుకుని... "అయ్యో నా పొట్ట మళ్ళీ కాలి పోయింది! ఉఫ్!ఉఫ్!!" అంటూ ఊదుకుంటూ, బాధతో చొక్కాతో కళ్ళు తుడుచుకున్నాడు.




# చచ్చిపోయిన బాకీ!

**చలమయ్య తనకి ఎవరైనా మోసం చేసినా, నమ్మకద్రోహం చేసినా సహించడు, క్షమించడు. వాళ్ళ మీద ప్రతీకారం తీర్చుకునే వరకు కునుకు కూడా తీసేవాడు కాదు. ఇప్పుడే కాదు... ఈ పాలసీ చెడ్డీలు వేసుకొనే రోజుల్లో నుండి ఇదే పంథా అవలంబించేవాడు.**

పదో తరగతి పరీక్షలు రాస్తున్నప్పుడు చలమయ్య రాసిన ఆన్సర్ షీట్ చూసి కాపీ కొట్టనిస్తే పుల్ల ఐసు కొనిస్తానని అతగాడి ఫ్రెండ్ దేవానంద్ నమ్మబలికాడు. వాడి మాటలు నమ్మిన చలమయ్య అందుకు ఓకేనని ఎగ్జాం హాల్లో తన ఆన్సర్‌షీట్స్ వాడికి ఇచ్చి కాపీ కొట్టడానికి హార్ట్ ఫుల్‌గా సహకరించాడు. పరీక్షలు అయ్యాక కొనిస్తానన్న పుల్లఐసు కొనివ్వకుండా ఎగ్గొట్టాడు దేవానంద్.ఆ నమ్మకద్రోహాన్ని జీర్ణించుకోలేకపోయాడు చలమయ్య. ఏదో విధంగా ఆ దేవానంద్‌కు డ్యామేజీ చేసి తన ప్రతీకారం తీర్చుకోకపోతే చలమయ్య మనశ్శాంతిగా ఉండలేడు.

దేవానంద్‌తో చలమయ్య మంచిగానే ఉంటూ ఒకరోజు అతని ఇంటికి వెళ్ళాడు. దేవానంద్ తొడుక్కోబోతున్న నిక్కర్లో... ఎర్ర చీమల్ని వదిలాడు. ఆ ఎర్ర చీమలు చేసిన అరాచకానికి దేవానంద్ కి కల్గిన బాధ అంతా ఇంతా కాదు. ఈ విధంగా చలమయ్య తన ప్రతీకారాన్ని తీర్చుకున్నాడు.


ఇలాగే మరో ఇన్సిడెంట్ కూడా వుంది.

చలమయ్య ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు జోగారావ్ అనే ఫ్రెండ్, హిస్టరీ ఎగ్జాం రోజు ఎకనామిక్స్ అని అబద్ధం చెప్పాడు. చలమయ్య అది నిజమని నమ్మి ఎకనామిక్స్ సబ్జెక్ట్ ప్రిపేర్ అయి... ఎగ్జాం రాయడానికి వెళ్ళాడు... దాంతో హిస్టరీ సబ్జెక్ట్‌లో అట్టర్ ఫెయిల్ అయ్యాడు.


చలమయ్య తనని దారుణంగా మోసం చేసిన జోగారావ్ మీద కసి పెంచుకున్నాడు. ప్రతీకారం తీర్చుకోడానికి అవకాశం ఎదురుచూస్తుండగా... ఒక విషయం తెల్సింది. సుగుణమ్మ అనే అమ్మాయిని జోగారావ్ ప్రేమిస్తున్నాడు అని. ఆలశ్యం చేయకుండా సుగుణమ్మ ఇంటికి వెళ్ళి... అమ్మాయి నాన్నతో జోగారావ్ ప్రేమ విషయం చెప్పాడు. దాంతో వెను వెంటనే సుగుణమ్మను ఓ ఎన్నారై శాల్తీకి ఇచ్చి పెళ్లి చేసి... ఆ అమ్మాయిని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు సెండ్ చేసేశాడు. సుగుణమ్మను ఎంతగానో ప్రేమించిన జోగారావ్, ఆ అమ్మాయికి పెళ్లి అయిపోయిన విషయం తెల్సుకుని వలవల ఏడ్చాడు. సుగుణమ్మను మర్చిపోవడానికి చీపు లిక్కర్ తాగడం అలవాటు చేసుకున్నాడు జోగారావ్.

ఒకరోజు తాగిన మత్తులో రోడ్ మీద పడి వున్న జోగారావ్‌ని చూసి చలమయ్య తృప్తిగా సంతోషించాడు. ఈ విధంగా తనకి కీడు తలపెట్టిన వాళ్ళమీద ఏదో విధంగా రివెంజ్ తీర్చుకోకుండా సైలెంట్‌గా వుండడం చలమయ్య వల్ల కాదు.

ఇక ఇలాంటి ఫ్లాష్ బ్యాకులు పక్కన పెడితే, చలమయ్యకు ఇప్పుడు డెబ్బై ఏండ్ల వయసు. ఆయనకు సహదేవ్, మహదేవ్ అనే ఇద్దరు కొడుకులు వున్నారు. ఇద్దరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. చలమయ్య భార్య కొన్నాళ్ళ క్రితం కన్నుమూసింది. దాంతో ఒంటరి అయిన చలమయ్య కొడుకుల ఇండ్లల్లో చెరో ఆరు నెలలు వుండడం చేస్తున్నాడు.




చలమయ్యను తన కొడుకులిద్దరూ ఓ తండ్రిగా కాదు ఓ మనిషిగా కూడా చూడడం లేదు. ఆ బాధను అణచుకుని ఏమీ చేయలేని స్థితిలో ఆ క్షోభను భరిస్తూ సహిస్తూ జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు. చలమయ్య తన కొడుకులకు ఏలోటూ లేకుండా ఎన్నో కష్టనష్టాలకు ఎదురొడ్డి వాళ్ళని బాగా చదివించాడు. వాళ్ళని పెంచి పెద్ద చేసి పెళ్ళిళ్ళు కూడా ఘనంగా చేశాడు.




తన కొడుకులని నమ్మి తన ఆస్తంతా వాళ్ళ ఇద్దరి పేరా రాసేశాడు. ఇప్పుడు ఆ సుపుత్రులి ద్దరూ చలమయ్యను గుదిబండలా ఫీల్ అవుతూ చీటికి మాటికి చిరాకు పడుతూ ఆయన చావు కోరుకుంటూ వున్నారు.

కొన్నాళ్ళ క్రితం... చలమయ్య తన ఊళ్ళో వున్న భూపతి అనే వాడికి 'నాకు అవసరం వున్నప్పుడు అడుగుతాను అప్పుడు ఇద్దువు అని చెప్పి ఓ పాతిక వేలు ఆయనకు ఇచ్చి దాచ మన్నాడు. అందుకు సరే అన్నాడు భూపతి.

కొన్నాళ్ళ తర్వాత ఒక రోజు చలమయ్యకు డబ్బు అవసరం వచ్చి... పాతికవేలు ఇమ్మని భూపతిని అడిగాడు.

"నువ్వు అసలు నాకు డబ్బే ఇవ్వలేదు... ఇచ్చినట్టు సాక్ష్యం వుంటే చూపించు!..." అని భూపతి అడ్డం తిరిగాడు. భూపతికి తను డబ్బు ఇచ్చినట్టు సాక్ష్యం లేదు కాబట్టి ఈ విషయాన్ని తన కొడుకులు చెబితే వాళ్ళు తననే తిట్టి పోస్తా రని చలమయ్యకు తెల్సు. అందుకని భూపతిని ఏమీ అనలేక పెల్లుబికి వస్తున్న కోపాన్నీ కసినీ కష్ట సాధ్యం మీద కంట్రోల్ చేసుకున్నాడు.

ఇలా కొన్ని రోజులు గడిచాక...

చలమయ్యకు ఆరోగ్యం బాగోక మంచాన్ని ఆశ్రయించాడు. కొడుకూ కోడళ్ళ అవమా నాలు, చిత్కారాలు భరించలేక... చలమయ్య జీవితం మీద విరక్తి పుట్టి ఆత్మహత్య చేసుకో వాలనుకున్నాడు.


భూపతికి తను నమ్మి... పాతిక వేలు ఇస్తే మోసం చేసిన వాడిమీద... ఎన్నో కష్టనష్టాలు భరిస్తూ తన కొడుకులిద్దరినీ ప్రయోజకుల్ని చేసినా వాళ్ళు ఇప్పుడు తన మీద చూపిస్తున్న నిరాదరణకు ఓర్వలేకపోయాడు. వీళ్ళందరికీ తగిన శాస్తి జరిగేలా చేసి తన ప్రతీకారాన్ని తీర్చుకోవాలనుకున్నాడు.

వన్ ఫైన్ డే చలమయ్య తన చేతికి దొరికిన టాబ్లెట్స్ అన్నీ తీసుకుని మింగేశాడు. కాసేపట్లో తను చనిపోతానానని తెల్సుకున్న చలమయ్య తన కొడుకులిద్దరినీ పిలిచి– "నేను మీకు తెలియకుండా ఎన్నో ఏళ్ళుగా కూడబెట్టిన పాతిక లక్షలు భూపతికి ఇచ్చి దాచమన్నాను. వాడి దగ్గరి నుండి మీరు చెరో పన్నెండు లక్షలు తీసుకుని... మిగతా లక్ష నా ఫ్రెండ్ రామ నాథంకు ఇవ్వండి" అని చింతాకంత నిజానికి అరిటాకంత అబద్దం యాడ్ చేసి చెప్పి... తుది శ్వాస వదిలాడు.

చలమయ్య చెప్పిన పై విషయాన్ని ఎవిడెన్స్ గా ఉంటుందని కొడుకులిద్దరూ దాన్ని సెల్ ఫోన్లో రికార్డ్ చేసి కూడా పెట్టుకున్నారు.

చలమయ్య అంత్యక్రియలు అయ్యాక సహ దేవ్, మహదేవ్ ఇద్దరూ భూపతి ఇంటికి వెళ్ళి తన నాన్న చెప్పిన మ్యాటర్‌ని చూపెట్టి పాతిక లక్షలు ఇవ్వమని అడిగారు.

"మీ నాన్న నాకు రూపాయి కూడా ఇవ్వ లేదు... ఇలాంటి సిల్లీ ఎవిడెన్స్‌లు పట్టుకొస్తే ఇచ్చేస్తాననుకున్నార్రా! వెళ్ళండి ఇక్కడినుంచి." అన్నాడు భూపతి.



దాంతో భూపతిని అన్నదమ్ములిద్దరూ పట్టుకుని కొట్టారు. పరిస్థితి విషమించడంతో ఈ ఉదంతం పోలీస్‌స్టేషన్ కు షిఫ్ట్ అయింది. సబ్ఇన్స్పెక్టర్ అక్రం రాథోడ్ ఇరువర్గాల వ్యక్తుల వాదనలు విని...

“ఈ రోజు నేను బిజీగా వున్నాను. రేపు మీకు కబురు చేస్తాను. అప్పుడు వద్దురు...' అని చెప్పి ముగ్గురినీ పంపేశాడు.

మరుసటి రోజు భూపతిని అక్రం రాథోడ్ పిలిపించి–

“నువ్వు వాళ్ళ నాన్న దగ్గర డబ్బు తీసుకున్నట్టు... తిరుగులేని వీడియో ఎవిడెన్స్ వాళ్ళ దగ్గర వుంది కావున వాళ్ళు కోర్ట్‌కు పోతే నువ్వు డబ్బు కట్టినా మోసం చేశావని జైలుకు వెళ్ళాల్సుంటుంది.” అని భయపెట్టి...

“నువ్వు నాకు పదిలక్షలు ఇస్తేవాళ్ళకు నువ్వు ఏమీ ఇవ్వకుండా... వుండేటట్టు నేను మ్యానేజ్ చేస్తాను!” అని అన్నాడు.


“సరే” అని పది లక్షలు ఇచ్చేశాడు భూపతి.

తర్వాత సహదేవ్, మహదేవ్‌ని పిలిపించి–

“మీ నాన్న చెప్పింది కోర్ట్‌లో నిలబడదు... అయినా ఏదో విధంగా ఆ భూపతిని బెదిరించి మీకు పాతిక లక్షలు ఇచ్చేట్టు చేస్తాను. మీరు నాకు చెరో ఇదు లక్షలు ఇవ్వండి!” అన్నాడు.

ఎలాగూ పాతికలక్షలు వస్తాయి గదాని... ఇద్దరూ అప్పు చేసి అక్రం రాథోడ్‌కి పది లక్షలు సమర్పించుకున్నారు.

“రెండు రోజుల్లో ఫోన్ చేస్తాను” అని చెప్పిన అక్రం రాథోడ్ నుండి ఫోన్ రాకపోయేసరికి భూపతి లాగే... సహదేవ్, మహదేవ్ కూడా పోలీస్‌స్టేషన్ చేరుకున్నారు.




పోలీస్‌స్టేషన్‌లో హడావిడిగా వుంది.

కారణం అడిగి తెల్సుకున్నారు.

అక్రం రాథోడ్ ట్రాన్స్‌ఫర్ అయిపోయి కొత్త లేడీ సబ్ ఇన్స్పెక్టర్ ఝాన్సీ హెగ్డే అనే ఆవిడ వచ్చింది అని తెల్సింది.

ఎస్సై ఝాన్సీ హెగ్డేని ముగ్గురూ కల్సి తమ పాతిక లక్షల పంచాయితీ గురించి విన్నవించుకున్నారు.

అది విన్న ఆమె– “ఏమయ్యా!... ఇలాంటి బేస్‌లెస్ కేసులని పట్టుకుని మరోసారి ఇక్కడికి వస్తే కుళ్ళబొడిచి బొక్కలో వేస్తా!... వెళ్ళండి వేస్ట్ ఫెలోస్...” అని ముగ్గరి మీద కోపంగా అరిచి... పంపేసింది.

స్టేషన్ బయటికి వచ్చిన సహదేవ్, మహదేవ్ తాము ఇచ్చిన డబ్బు వసూలు చేసుకునే ఉద్దేశంతో అక్రం రాథోడ్‌కి ఫోన్ చేశారు.

ఫోన్ లిఫ్ట్ చేసిన ఓ వ్యక్తి–

“హలో ఎవరు కావాలి మీకు?...” అని అడిగాడు.

“ఎస్సై అక్రం రాథోడ్ గారు వున్నారా?”

“వున్నాడు గానీ ఆయన మీతో మాట్లాడడం కుదరదు. ఎందుకంటే... ఆయన లంచం తీసుకుంటూ మాకు పట్టుబడ్డాడు... నేను అవినీతి నిరోధక శాఖ ఆఫీసర్‌ని. ఆయన ఫోన్ ఇప్పుడు మా దగ్గరే వుంది... ఇంతకీ మీరు ఎవరు?” అని అడిగాడు.


దాంతో టక్కున ఫోన్ కట్ చేశారు అన్నదమ్ములిద్దరూ.

ఇలాగే భూపతి కూడా అక్రం రాథోడ్‌కి ఫోన్ కాల్ చేస్తే పై విధంగా రిప్లై రావడంతో సైలెంట్ అయిపోయాడు.

యమలోకంలో వున్న చలమయ్య... భూపతితో పాటు తన కొడుకులిద్దరికీ కూడా పనిష్మెంట్ పడడంతో తన కసి తీరింది అని సంతోషించాడు.

కొన్ని పనులు చచ్చి కూడా సాధించవచ్చని ఆనందంతో చిందులేశాడు చలమయ్య.




Brewstark®
Clothing
Brewstark is a contemporary clothing brand offering premium shirts, jeans, trousers, and T-shirts crafted with uncompromised quality and style. Blending comfort, perfect fit, and distinctive design, Brewstark creates versatile fashion for the passionate and ambitious.
Brewstark
Plot # S17, Road No.10C,
Jubilee Hills, Hyderabad.
Ph- 9 0 0 0 2 2 2 4 1 1




మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని
పరిచయం చేస్తున్న శీర్షిక! **24**

## దాస్ (సెల్ఫీ)

**నా** పూర్తి పేరు గుళ్ళపల్లి చిత్తరంజన్ పద్మదాస్.

'దాస్' పేరుతో కార్టూన్స్ వేస్తుంటాను.

మా ఊరు కృష్ణా జిల్లా, మేదూరు గ్రామం. కానీ చిన్నప్పటి నుంచి పెరిగినదీ, చివరికి స్థిరపడి నదీ కూడా విజయవాడే.

విద్యాభ్యాసం పూర్తి చేసి టెలికాం డిపార్టుమెంటులో డీయీగా చేసి రిటైర్ అయిన తర్వాత సీరియస్‌గా కార్టూన్స్ మీద దృష్టి పెట్టి ఇప్పటికి ఆరు వేలకు పైగా కార్టూన్స్ వేశాను. ఇంచుమించు అన్నీ చాలా ప్రింట్ మరియు వెబ్ మ్యాగజైన్స్‌లో ప్రచురితమయ్యాయి.

సీనియర్ కార్టూనిస్టు మరియు హైకోర్టు అడ్వకేట్ శ్రీ అన్నం శ్రీధర్ (బాచి)గారి ప్రోద్బలంతో ఇప్పటికి ఏడు కార్టూన్ సంకలనాలను ప్రచురించడం జరిగింది. అన్నీ పాఠకుల ఆదరణ పొందాయి.

అలాగే గత ఏడు సంవత్సరాల నుంచి నా భార్య పేరున 'శ్రీమతి గుళ్ళపల్లి అరుణ కుమారి స్మారక కార్టూన్ పోటీ' నిర్వహిస్తూ, బహుమతీ ప్రదానం చేస్తూ నా వంతుగా తోటి కార్టూనిస్టులను ప్రోత్సహిస్తున్నాను.


ప్రపంచ తెలుగు మహా సభలతో సహా అనేక కార్టూన్స్ ప్రదర్శనల్లో పాల్గొనటం జరిగింది.


గత సంవత్సరం రోటరీక్లబ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.


గతంలో అమరావతి గీతం అనే వీడియో సాంగ్‌కు, రక్షితం అనే తెలుగు సినిమాకు ప్రొడక్షన్ మేనేజర్ బాధ్యతలు నిర్వహించాను. అలాగే మరి కొన్ని షార్ట్ ఫిల్మ్స్ మరియు టీవీ సీరియల్ నిర్మాణం లోనూ సహకారమందించాను.


నా తోటి కార్టూనిస్టులను శుభాకాంక్షలు.


హాస్యానందం రాము గారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.


















ఇదంతా ఒక ఇల్లే...స్థలం తక్కువ వలన
హాల్,బెడ్‌రూమ్స్,కిచెన్,డైనింగ్ ఇలా అన్ని
రూమ్స్ ఒక్కొక్కటి ఒక్కో ఫ్లోర్‌లో కట్టాడు.
దాస్



'టీ' ఏమైనా తాగుతావా,
ఇప్పుడెందుకులే అంటావా?
'టీ' తాగుతాను అనే
అవకాశం కూడా ఇవ్వలేదు
దరిద్రుడు!
©
దాస్



ఏమిటే బూతులు అరుస్తున్నావ్?
రాజకీయ నాయకుడి ఇంట్లో ఉన్నానన్న
అహంకారమా!
దాస్


ప్రతిరోజూ దోసలు మాడ్చేస్తుంది...
పైగా వాటికొక కొత్తపేరు 'బ్లాక్ దోసలు' అంటోంది!
©
దాస్


నాన్నగారికి సీరియస్‌గా ఉందిరా అంటే,
బిజీ,రావటానికి అస్సలు కుదరదన్నాడు...
ఆస్తి మొత్తం అక్కకి రాసేస్తున్నారు అన్నా...అంతే
పరుగెత్తుకొచ్చాడు అన్నయ్యా అబ్బాయి.!!!
దాస్


వాడికి స్కూటర్ నడుపుతూ సెల్‌ఫోన్
మాట్లాడటం బాగా అలవాటు..అందుకే
మామూలుగా ఉన్నప్పుడు కూడా అలాగే
తల వంచుతూ ఉంటాడు...
దాస్


ఇదివరకు ఎదుటివారిని పొగిడినప్పుడు
వాయించేవారు.,ఇప్పుడు సొంత డబ్బా
కొట్టుకుంటుంటే వాయిస్తున్నారు!!!
దాస్


ఎప్పుడు చూసినా బీపీ 120/80
చూపించే బీపీ మిషన్ ఉంటే ఇవ్వండి....
ABC SURGICALS
దాస్



బొందల నాగేశ్వరరావు,9500020101

# రిసెప్షన్ చేసుకో.... అప్పు తీర్చుకో!!

**రాజు, రావు చిన్ననాటి స్నేహితులు. ఇద్దరూ ఒక హోటల్లో కూర్చుని విందు ఆరగిస్తు న్నారు.**

**"ఏరా! హోటల్‌కు డబ్బులు లేకుండా వచ్చి, నా డబ్బు ఖర్చు పెట్టిస్తావు!... నీ డబ్బుతో నాకెప్పుడిస్తావురా పార్టీ?" అడిగాడు రాజు.**

"నువ్వడిగింది కరక్టు మామా! కాని నీకు పార్టీ ఇవ్వాలనుకున్నా నేను ఇవ్వలేను. ఎందుకంటే అది మన ఇద్దరి నొసళ్ళమీద ఆ దేవుడు రాసిన రాత. కనుక ఇంకెప్పుడూ నన్ను పార్టీ ఇమ్మని అడగమాకు! నేను టెన్త్ ఫెయిలయి సూపర్ మార్కెట్టులో సేల్సుమేన్ అవటం వల్ల ఆర్థికంగా బాగా వెనుకబడిపోయాను. నువ్వు ఇంజినీరువయి లక్షలు సంపాయిస్తూ, ఇంకా మీ అత్తగారు ఇచ్చిన కట్నాలు, రాసిచ్చిన ఇంటితో బాగా ఆస్తి పరుడవై పోయావు. కనుకనే నీ కూతురికి పేరున్న పెద్ద కళ్యాణ మంటపంలో ఇరవై రకాల వంటకాలలో పెళ్ళి చేసి అత్తారింటికి పంపించి... 'ఆహా' అనిపించుకున్నావు! అంతేనా... పెళ్ళి ఆహ్వాన పత్రికల్లో 'ప్రెజంటేషన్స్ ఆర్ అవాయిడెడ్' అని తాటికాయంత అక్షరా లతో వేసి... పైసా చదివింపు తీసుకోకుండా మన ఫ్రెండ్సు సర్కిల్లో పేరు సంపాయించుకున్నావు... ఇక నీకూ నాకూ పొంతన ఎక్కడుంది చెప్పు?" అంటూ భోరుమన్నాడు రావు.

"ఆడపిల్లలకు అలా పెళ్ళిళ్ళు చేయటం మా పద్ధతిరా మామా!... అంటే మా ఇంటి ఆడపిల్లలకు కిలోలతో బంగారాన్ని, వెండిని తోడిచ్చి అత్తారింటికి పంపాలి. నీకా బాధ లేదులే! పైగా నువ్వు కొడుకునేగా కన్నావు. పైసా ఖర్చు లేకుండా వాడికి వాడి అత్తగారే పెళ్ళి చేశారాయె!"?

"అది కరక్టే కానీ... పెళ్ళి సాకుతో జల్సా చేయటానికి నేను నీ వద్ద ముప్పై వేలు అప్పు చేశాను. ఆ డబ్బును తిరిగి ఇవ్వాలిగా? అందుకే నేనో ప్లాను వేశా. అంటే మావాడి పెళ్ళి విజయవాడలో జరిగింది కనుక నీలాంటి స్నేహితులు నలుగురంటే నలుగురే వచ్చి మనిషికి అయిదొందలు చదివించి వెళ్ళిపోయారు. అందుకే ఇక్కడ చెన్నైలో ఈ నాలుగు రోజుల వ్యవధిలో రిసెప్షన్ ఏర్పాటు చేసి మూడు వందల కార్డులు అచ్చు గుద్దించి అందరికి పంచి... చదివింపులు కలెక్టు చేసుకొని వాటిని అప్పుల వాళ్ళకు పంచేద్దామనుకొంటున్నాను. ఎలా వుంది నా ఐడియా?" అన్నాడు రావు.

"సరే...అందుకు నేనేం చెయ్యాలి?" అడిగాడు రాజు.

"రిసెప్షన్ ఖర్చులగ్గాను ఇంకో డెబ్భై వేలు అప్పివ్వరా! రిసెప్షన్ అవగానే ఒక్కసారే లక్ష రూపాయలు యిచ్చేస్తాను!" ప్రతిమాలినట్టు అన్నాడు రావు.

పకపక నవ్వాడు రాజు.

"ఎందుకురా అలా ఇరగబడి నవ్వావు?" రాజు ముఖంలోకి చూస్తూ కోపంగా అడిగాడు రావు.


"నవ్వక...నీ మాటలకు తలూపమంటావా?"

"తలూపటం కాదురా! అలా రిసెప్షన్ పెట్టుకుంటే బోలెడు డబ్బులొ స్తాయి. నాకున్న అప్పులు తీర్చుకోవచ్చు కదా!?" అని తన మాటల్ని సమర్థించుకొంటున్న సమయంలో ఇంకో ఫ్రెండు గిరి తనని పిలవ కుండా హోటల్‌కివచ్చారన్న కోపంతో- "ఏమిట్రా నన్ను పిలవకుండానే వచ్చేశారు... వస్తూ వస్తూ అలా మా ఇంట్లోకి ఓ కూతేస్తే నేనూ మీతో వచ్చేవాణ్ణిగా!" అన్నాడు గిరి.

"సారీరా మామా! నిన్ను పిలవకుండా వచ్చింది తప్పే!... ఎలాగో నువ్వూ వచ్చావు. ఇప్పుడు సమస్య అది కాదు... మన రావుగాడికి వున్నట్టుండి డబ్బులు సంపాయించే ఐడియా ఒకటి వస్తే దాన్ని ఎలా అమలు పరచాలని ఆలోచిస్తున్నాం... ఓ పక్క నాకు ఆ ప్రయత్నం వద్దురా మానుకో అని చెప్పాలని వుంది. మరో పక్క ఆ మాట వీడి ముఖమ్మీదే అంటే బాధ పడతాడేమోనన్న బాధ కూడా వుంది." అన్నాడు రాజు డ్రింక్ గటగటా తాగుతూ.

"అలాగా! అయితే అదేదో నాతో చెప్పుకోరా! మోహమాట పడకుండా విషయాన్ని చక్కగా క్లియరు చేస్తాను!" అన్నాడు గిరి.

"అదేంటంటే... మొన్న విజయవాడలో పెళ్ళి జరిగిన వీడి కొడుక్కి రాబోయే ఆదివారం నాడు చెన్నైలో రిసెప్షన్ పెట్టి... ఆ రిసెప్షన్లో చదివిం పుల రూపంతో వచ్చే డబ్బుల్తో అప్పులు తీర్చి పారేయాలన్నది వీడి ప్లాను!"




"నాకు మేటరు అర్థమైంది... అంటే ఇక్కడ చెన్నైలో వున్న మనలాంటి స్నేహితులకు, దగ్గరి బంధువులకు, వీడి ఇంటి పక్కనున్న తెలిసిన వాళ్ళకు ఇన్విటేషన్లు పంచి రిసెప్షనుకు రప్పించి డబ్బుల్ని గుంజేసి ఆ డబ్బుతో అప్పులు తీరుస్తాడన్నమాట. బాగానే వుంది ఐడియా!... ఇంతకు అంత మంది రిసెప్షనుకు వస్తారా మామా?" ప్రశ్నించాడు గిరి.

"ఎందుకురార్రా?! నేను పదేళ్ళనుంచి బోలెడు మందికి చదివింపు లేశానుగా!?"

"అలాగా! అంటే ఒక్కొక్కరికి కనీసం రెండు వందలైనా వేసుంటావు. అంతేగా?"

"ఆఁ! నాకు బంధువులైన వాళ్ళకు, స్నేహితులకు రెండొందలు... వందని, ఇతరత్ర వాళ్ళకైతే యాభైలు చాలా మందికే వేశానురా!"

"అంటే గడిచిన పదేళ్ళలో దాదాపు లక్ష రూపాయలదాకా చదివించి వుంటావన్న మాట...



ఓకే! మరి నువ్వు చెప్పిన వాళ్ళందరూ ఇప్పుడు చెన్నైలోనే వున్నారంటావా?" అడిగాడు గిరి.

"ఆఁ! వున్నారు!" అన్నాడు రావు.

"అయితే సరే...వెంటనే కార్డులు అచ్చు గుద్ది అందరికి పంచు... పోతే నీకయ్యే ఖర్చును గూర్చి నేను చెపుతాను. శ్రద్ధగా విని ఆలోచించుకో! నీ లెవల్కి తగ్గట్టు తక్కువ పక్షం మంటపానికి, భోజన ఖర్చులకు ఒకటిన్నర లక్ష.... వీడియో, ఫోటోగ్రాఫు, దండలకు ఓ యాభై వేలు...అంటే మొత్తం రెండు లక్షలన్నమాట. మరి నీకు చదివింపు రూపంతో అంత డబ్బు వస్తుందో రాదో తెలియదు. అసలు ఎంతమంది వస్తారో కూడా తెలియదు...అవునా!?" ఆలోచన ధోరణితో అన్నాడు గిరి.

"అదేరా నా గోలంతా! ఇప్పుడు నువ్వు చెప్పిన లెక్క ప్రకారం ఖర్చు రెండు లక్షలైతే వీడు ఇంత వరకూ చదివించింది లక్షే!... మరి రెండు లక్షలెలా వస్తాయి?! మూడు వందల ఇన్విటేషన్లకు... ప్రతివాడు కచ్చితంగా అయిదు వందల వంతున చదివిస్తేనే వచ్చేది లక్షా యాభై వేలే!...నాకైతే అసలు వచ్చిన ప్రతివాడు అయిదు వందలు చదివిస్తాడన్న నమ్మకమూ లేదు!..." క్యాల్క్యులేటరు మైండుతో పూర్తి వివరాలు చెప్పేశాడు రాజు.

రాజు మాటలకు షాక్ తిన్నాడు రావు. ఒక్క నిముషం ఆలోచించాడు. గిరి, రాజులు చెప్పిన ఆ మాటల్లో ఎంతైనా వాస్తవం వుందని గ్రహించి చేసేది లేక నిరుత్సాహంతో వాళ్ళ మొహాల్లోకి చూస్తూ వుండిపోయాడు.

ముగ్గురూ తలో వాటర్ బాటిల్ చేతుల్లోకి తీసుకుని గటగటా తాగి... ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.

"చూడ్రా!... ఇలా ఏదో పిచ్చి పని చేసి ఇంకా అప్పుల పాలు కాకూడదన్నదే మా ఉద్దేశ్యం. విజయవాడ నుండి వధూవరులతో పెళ్ళివారొస్తే చక్కగా మీ ఇంట్లోనే ఫంక్షన్ చేసుకో. ఇక నాకివ్వాల్సిన ముప్ఫైవేలు కూడా నీకు కుదిరినప్పుడే ఇవ్వు!" అన్నాడు రాజు.

తల గోక్కొంటూ "సరేఁ"నని తలూపాడు రావు.

ఇక్కడ ఎవరికీ తెలియని విషయమేమిటంటే...రాజు చేతే తనకు ఇవ్వాల్సిన డబ్బులు కుదిరినప్పుడే ఇవ్వమనిపించడం! అయితే మనకి తెలియాల్సిన విషయం ఏమిటంటే అది ఎప్పటికీ కుదరదని!

ప్రతి నెలా ఇతర భాషలకు చెందిన ఒక భారతీయ కార్టూనిస్టుల పరిచయం

నిర్వహణ: నాగిశెట్టి

## శ్రీయుతులు అశ్విని కుమార్ రథ్ & అబాని కుమార్ రథ్

ఈ నెల ఇండియన్ ఇంక్ శీర్షికలో హాస్యానందం పాఠకులకు అందించబోతున్న ఒక ప్రత్యేకమైన జంట కార్టూనిస్టు (ల) పేర్లు శ్రీ అశ్విని కుమార్ రథ్ మరియు శ్రీఅబాని కుమార్ రథ్.

ఇద్దరి పేర్లు రాసారేమిటా అని ఆశ్చర్యంగా ఉందా? ప్రత్యేకత అదే మరి! జంట కవుల లాగా వీళ్ళు జంట కార్టూనిస్టులు అన్న మాట!

అంతేకాదు అన్నదమ్ములు కూడా. ఇద్దరూ కలసి కార్టూన్లు వేస్తూ వేస్తూ వేస్తూ వీరు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ లోకి కూడా ఎక్కేశారు.

ఒరిస్సాలోని బోలంగిర్ కు చెందిన వీరి తండ్రి- శ్రీ గోపాబంధు రథ్, తల్లి శ్రీమతి వినోదిని.

ఇద్దరూ జంటగా 1989 నుంచీ కార్టూన్లు వేస్తున్నారు.



వీరి మొదటి కార్టూన్ 'బజ్రబన' అనే ఒరియా పత్రికలో ప్రచురితమైంది. అప్పటినుంచీ వీరి కార్టూన్ ప్రచురించని పత్రికే లేదంటే అతిశయోక్తి కాదు.

శ్రీఅశ్విని బాటనీ ప్రొఫెసర్‌గా చేస్తుంటే, శ్రీఅబాని, ఎల్.ఐ.సి లో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా చేస్తున్నారు.

వీరి కార్టూన్లు ప్రచురించిన పత్రికలలో...

The Times of India, The New Indian Express, The Telegraph, Suntimes, The Sambad, The Samaj, The Prajatantra, Dharitri,Anupam Bharat, Bartaman Parikrama, Bisheshakhabar, Chandrika, RudraAwhan, Drustipata, Swabhimann, Digbalaya, Anchalika samachar, Anchalika sambad, Cartoon Watch, Science Reporter,Current Science,Sunday Indians, Durmukha, SachitraVijaya, Bindass, Nabaneeta, Bajrabana, Sri Haribol,Byanga Darabar, Subhas Chintan... ఇంకా ఎన్నెన్నో....






కజిన్ బ్రదర్స్ అనే పేరుతో వేసిన వీరి (స్ట్రిప్ కార్టూన్లు) ఎంతో పేరును సంపాదించాయి. వీరిద్దరూ ఎన్నో పత్రికలకు కవర్ పేజీలు డిజైన్ చేయడమే కాకుండా వాటిల్లో Illustrations కూడా వేశారు.

వీరి కారికేచర్లు ఎన్నో యూనివర్సిటీలలో, మరిన్ని ప్రసిద్ధి పొందిన సంస్థలలో ఎగ్జిబిట్ చేయబడ్డాయి.

వీరు Anatomy of Autonomy (Cartoons) మీద ఒక పేపర్ National Seminor లో ప్రెజెంట్ చేయడం జరిగింది.

ఎన్నో కార్టూన్ ఎగ్జిబిషన్లు సోలోగా నిర్వహించడం జరిగింది.

వీరి కార్టూన్లు 60 కి పైగా దేశాలలో ఎగ్జిబిట్ చేయడం జరిగింది. వీరిరువురూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో లెక్కలేనన్ని బహుమతులు పొందడం జరిగింది.

ఏ అంతర్జాతీయ పోటీలలో కార్టూనిస్టుల లిస్ట్ చూసినా వీరి పేర్లు కచ్చితంగా కనిపిస్తాయి. వీరు పొందిన పురస్కారాలను, విజయాలను చూస్తుంటే వీరు మన భారతీయ కార్టూనిస్టులైనందుకు ఎంతో గర్వంగా అనిపిస్తుంది.

వీరు కార్టూన్లకు సంబంధించిన పెద్ద అంతర్జాతీయ సంస్థల్లో మెంబర్లుగా ఉన్నారు.

వీరిరువురూ ఎన్నో కార్టూన్ల workshops ని కూడా నిర్వహించడం జరిగింది. వీరు చాలా ఆర్ట్ ఎగ్జిబిషన్స్ లో కూడా పాల్గొనడం జరిగింది.













P.C.Rath Memorial International Web Cartoon Contests (8 th Edition was in 2023 with 167 Entries from 42 Countries) కి వీరు Convener Jury Membersగా వ్యవహరించడం జరిగింది.

మన కార్టూనిస్టులు వీరిలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకున్నట్లయితే అంతర్జాతీయ స్థాయిలో మన తెలుగు కార్టూనిస్టుల విజయ కేతనం ఎగరడం ఖాయం.

**వీరి ఫోన్ నంబర్లు:** : +91 94370-93148 (Aswini)
+91 94373-30643 (Abani),
Email: aswiniabani@rediffmail.com.
**ఫేస్‌బుక్ :** https://www.facebook.com/abani.rath.5,
Web page:www.aswiniabani.com



వడలి రాధాకృష్ణ, 9985336444

# భలే మంచి చౌకబేరము!

**తరచి చూసుకున్నాడు. అంతేనా తడిమి తడిమి మరీ చూసుకున్నాడు!! 'నిజమేనా ఇది?!' సూరబ్బాయికి ఏమీ అర్థం కాకుండా ఉంది.**

**గిర్రున తిరగాడి చివరకు అటువైపు తిరిగి ఒత్తిగిల్లాడు.**

**"చాల్లెద్దూ సంబరం! తెల్లారుతోంది. కోటపేటలోని నాటు కోడి కూసే వేళయిపోయింది!! ఏమిటీ పిచ్చి పరాచకాలు, సరస సల్లాపాలూను..." సూరేకారంలోని విరసం వెల్లువెత్తు తోంది.**

సూరబ్బాయి భార్యమణి ముందు నాటుకోడిలాగ మారిపోయినాడు. పరవశం వచ్చి చిన్నగా వెన్ను తడుతున్నా పలకలేదు. మరల మరల తడిమి చూసుకున్నాడు. అదే తాను వ్రాసి పారేసిన 'వికారపు జల్లులు' కవితా గ్రంథాన్ని తడిమి చూసుకున్నాడు.

చీకటిలో తడుముతున్నాడేమో... ఎడంచేయి, ఎడంకాలు ప్రక్కనే మంచం మీద పడుకున్న భార్యామణి సూరేకారానికి తగిలేసాయి. అదే పగటిపూట అయితే సూరేకారంలా మండిపోయేది. కానీ రాతిరి జాము కావడం, చలిరాత్రి కావడంతో... సూరేకారం కాస్తా తడిసిన కారం లాగ చప్పగుండి, వర్ధనరేవు సముద్రంలాగ ఉప్పొంగిపోతోంది. పైగా తన పెనిమిటి ఈ మధ్యనే తాను రెండు చేతులతో వ్రాసి పారేసిన 'వికారపు జల్లులు' కవితాగ్రంథానికి తన పేరు పెట్టేసరికి ఉప్పొంగి పోతోంది. మొగుడి గుండెల్లో తనకున్న పదిలమైన స్థానాన్ని చూసుకుని ఉబ్బిపోతోంది.

సూరబ్బాయికి ఈమధ్యన కాసింత కళాపోషణ ఎక్కువయిపోతోంది. దానితో కనిపించిన ప్రతి విషయం మీద కవితల్ని అదే పనిగా రాసి పారేస్తున్నాడు.

ఈ వేకువజాము పెనుగులాటలలో బయట ఎక్కడో... నాటుకోడి కూసేసింది. కోడి కూసినాదంటే సూరబ్బాయి కలం ఎక్కుపెట్టి తీరా ల్సిందే! అది కవిగారి సెంటిమెంటు. అంతే ప్రక్కనే ఉన్న పాత కాగితాల పద్దుల పుస్తకాన్ని చేతుల్లోకి తీసేసుకున్నాడు.

సూరబ్బాయిని ప్రకృతి పరామర్శిస్తుంటే పులకించిపోతున్నాడు. అంతే తానో అక్షర హరివిల్లుగా మారిపోతున్నాడు. ఆగక ఎడాపెడా రాసి పారేస్తున్నాడు.

అప్పట్లో సూరబ్బాయి చద్దిమూట చేతపట్టుకుని చవటపల్లి మిల్లులో గుమాస్తాగిరీకి చేరాడు. తనకీ ఓనరుకీ మాటలు పొసగలేదు. కుదరని చోట కుదురుకోవడం కష్టమని నష్టమైనా ఉద్యోగం మానిపారేసాడు.

తరువాత పారువేట బోటురేవు దగ్గర టికెట్స్ చించే క్లర్క్ ఉద్యోగానికి చేరాడు. అక్కడా కాసింత అటుఇటుగా సెగ తగిలేసింది. అదే అక్కడ బయలుదేరిన బుల్లిబోటు సుడిగుండంలో చిక్కుకుని... సరిగా నది మధ్యలో మునిగిపోయింది. కాసింత ప్రాణనష్టమూ జరిగిపోయింది. అంతే!... టికెట్లు అమ్మినోడిదే సెంటిమెంటు అంటూ బోటు ఓనరు చేయి ఇచ్చేసాడు. మరికొన్ని ఉద్యోగాలలో కూడ ఇలా అయిపోయింది.

సూరబ్బాయికి ప్రతిసారీ చిక్కు ఎదురవుతూ ఉంది. అప్పుడు తనకు కొంత అండగా మరికొంత దండగా ముతకరాజు నిలుస్తూనే ఉన్నాడు. పేరులో ముతకున్న... ముతకరాజు అంత ముతగోడు ఏమీకాదు. స్నేహానికి ప్రాణం ఇచ్చేస్తాడు. అందుకే సూరబ్బాయికి అక్కరకొస్తూ ఉన్నాడు.

మొత్తానికి మొన్నటి ఆరునెలల పైచిలుకు కరోనా లాక్‌డౌన్ పుణ్యమా అంటూ పనిలేని అబ్బాయి, అదే సూరబ్బాయ్ ఇంటికే పరిమితమై పోయాడు. పరిమితమైనవాడు కవిగా మారిపోయాడు... కలం పట్టి కరోనా భరతాన్ని పట్టడం మొదలుపెట్టేసాడు... అదే ఖాళీగా ఉన్న తన హృదయఘోషను వల్లెవేయడం మొదలు పెట్టాడు... అంతేనా ఆ వెనుక ఎక్కడో వచ్చిన మిడతలదండుల మీద తన కలాన్ని ఎక్కుపెట్టే సాడు.

ఇంట్లో పనిలేని సూరబ్బాయ్ కవిగా కలం పట్టి ప్రతాపం చూపెడుతూ ఉన్నాడు.

మొదట్లో మొగుడి నిర్వాకాన్ని చూసిన సూరే కారం దీపావళి దినుసుల్లో సూరేకారం లాగ... రగిలిపోయింది. ఆనక ఎగిరిపోయింది.

'అది కాదు చెల్లెమ్మా! బావంటే ఏమను కున్నావు? చూస్తూండు. రేపు నీకు అందదు!...' ముతకరాజు మాటంటే సూరేకారానికి నప్పు తుంది. పైగా మధ్యలో సిస్టర్ సెంటిమెంట్ తీసు కొచ్చేస్తాడు.



సూరబ్బాయి ఆగడంలేదు. అదే పనిగా బుర్రకి చేతికి పని చెప్పి రాసి పారేస్తున్నాడు.

మొదట్లో ఒకటి రెండు అనుకున్నవి ఇప్పుడు సంఖ్య సాగి డజన్లు అయిపోతున్నాయి. ఆపైన వందల్లోకి వెళ్ళిపోతున్నాయి.

సూరబ్బాయి సూరపరాజుపల్లెలో పెద్ద కవిశేఖరునిగా చెలామణీ అయిపోతున్నాడు. వాట్సాప్‌లు, ఫేస్‌బుక్‌లు బాగా నేర్చుకున్నాడు... ఎవరు ఏమి వ్రాసినా లైక్‌లు కొట్టేస్తున్నాడు. అవతలివాళ్ళు కూడా తనను అలాగే ఆకాశానికి ఎత్తేస్తూంటే... తనలోని కవితావేశం కాస్తా సునామీగా, చివరికి హుద్‌హుద్‌గా మారిపోతోంది.

'బావా! నువ్వు పుస్తకం వేయాల్సిందే!...' ముతకరాజు ఉన్నట్టుండి ఒక అడ్వైజ్ పారేసరికి... తాను ఎక్కడెక్కడో ఆలోచిస్తున్నాడు.

వెంటనే వెళ్ళి పుస్తకాల పారువేట మొదలెట్టేసాడు.


"నీ ఏభై కవితల పుస్తకానికి పాతికవేలు అవుతుందట!" ముతకరాజు తెచ్చిన కొటేషన్ సూరబ్బాయికి చుక్కల్ని చూపెడుతున్నాయి.

సూరేకారానికి మొగుడి ఆలోచన అతిగా ఏమీ అన్పించడంలేదు. కానీ అంత పెట్టుబడి పెట్టడం తమ వల్ల కాదంతే!

"చెల్లాయ్! మీకు ముతక అన్న లేదనుకున్నావా! కరోనాలో పాజిటివ్ వచ్చి పోయాడనుకున్నావా!!..." అన్న సెంటిమెంట్ ఆమెను రగలని సూరేకారం చేస్తూ వుంది.

"బావ తన 'వికారపు జల్లులు' కవితాసంకలనాన్ని మన ఊరిలోని నిర్వీరామం గారికి అంకితమిస్తున్నాడంతే! డబ్బు ఆయనది. పరపతి బావదీను."






ముతకరాజు తనకు ఒకదారి చూపించే సరికి... ఎగువ డబ్బు కాలువ అలలాగ ఉబ్బి తబ్బిబ్బయి పోయినాడు.

నిర్విరామంగారు మంచి సౌండ్ పార్టీ. చేసే పనులు కూడ గొప్ప సౌండ్‌గా ఉండేవి. ఒకప్పుడు ఊరిలో కాంట్రాక్టరు పనులు చేసేవాడు. ఆనక నష్టాలు రావడంతో జెండాలను దింపేసినాడు. ఆపైన కమీషన్ వ్యాపారాలు చేసేవాడు. అక్కడా బురదలో కాళ్ళు పడిపోయే సరికి ఆ నష్టాలను భరించలేక కాళ్ళూ చేతులు కడిగేసుకుని ఒడ్డున పడిపోయాడు.

ఆ తర్వాత తత్వం బోధపడిపోయింది. ఏ పనీ చేయక నిర్విరామం ఇంటిపట్టున ఉండి పేరు కోసం సేవాకార్యక్రమాలు, దాన ధర్మాలు చేస్తూ కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

ఆ నిర్విరామంగారు తన 'వికారపు జల్లులు' కవితా సంకలనం అంకితం తీసుకోవడం... గొప్ప గాను గౌరవంగాను అన్పిస్తూ వుంది... సూరబ్బాయికి. పుస్తకంలో అచ్చేసిన తన రాతలు విపరీతమైన కిక్కు ఇస్తున్నాయి.

ముందు పేజీలో కలర్‌లో వేసిన నిర్విరామంగారు, వారి సతీమణి నిర్వకారం దంపతుల ఫోటో చూడముచ్చటగా ఉంది. ఈ మధ్యలో ప్రజలలో పరపతి బాగా తగ్గిపోయిన శాసనసభ్యులు చివటాలయ్య కూడా పిలవగానే ఆవిష్కరణ సభకు విచ్చేసి నిర్విరామ నిర్వికారాలకు, రచయిత సూరబ్బాయికి ఘన సన్మానం చేసి పోయినాడు.

విషయం పేపర్లో బాగా వచ్చేసింది.

వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో అంకితం అందుకున్న నిర్విరామం, నిర్వికారం దంపతుల సన్మాన ఫోటో తెగ హల్‌చల్ అయిపోయింది.

"చూసావా చెల్లెమ్మా! మా బావగారి పరపతి ఎంత పెరిగిపోయినాదో! చెప్పానా నీకు అందనంత ఎత్తుకు ఎగిరిపోతాడని" ముతకరాజు ఇస్తూన్న ప్రోత్సాహం సూరబ్బాయికి తెగ నచ్చేస్తోంది.

సూరబ్బాయికి గొప్ప కిక్కు ఎక్కేస్తూ ఉంది. ఎక్కిన కిక్కు నషాళం వరకు పాకేస్తూ ఉంది. అదే ఊపులో అదుపూ ఆజ్ఞా లేకుండా రాసి పారేస్తూ ఉన్నాడు.

సూరబ్బాయి లోని పిచ్చి ముదిరిపోతూ ఉంది. రెండో పుస్తకం కోసం ఆలోచిస్తున్నాడు.

పుస్తకం ముద్రించాలంటే పాతికవేలు రూపాయలు కావాలి. అప్పుడైతే నిర్విరామ దొరికాడు గానీ, ఇప్పుడు? ముతకరాజు దగ్గర విషయాన్ని లేవనెత్తేసాడు.

✦✦✦

"అబ్బాయ్!" ఆ పిలుపు కొత్తగా వుంది.

చీకటి పడిన తర్వాత తన ఇల్లును వెతుక్కుంటూ వచ్చిన మనిషిని చూసి ఆశ్చర్యపోయాడు. నిర్విరామం సార్.

రాత్రిపూట పూటుగా కంచాన్ని లాగించేసి ఆరుబయట మడతమంచం వేసుకొని పడుకున్న సూరబ్బాయికి అర్థం కావడంలేదు. ఒళ్ళు జలదరిస్తూ ఉంది.

'రండి సార్!' అమాంతంగా లేచి స్వాగతం పలికాడు. నిర్విరామం నుండి ఏమాటా లేదు.

నిర్వికారంగా వచ్చి కూర్చున్నాడు.

"నా పుస్తకానికి ఆర్థిక సాయం అందించి అంకితం తీసుకున్న కృతి భర్త మీరు. మీకు అనేక ధన్యవాదాలు." తనదైన ఫక్కీలో విషయాన్ని సాగతీస్తూ పలికాడు సూరబ్బాయి.

"ఆ కృతి భర్తే నా ప్రాణం తీసి పారేస్తోం దయ్యా!"

సూరబ్బాయికి అర్థం కావడంలేదు.

'బహుశా తన పాతికవేలూ వెనక్కి తీసుకుపోవాలని వచ్చాడేమో!' సూరబ్బాయి గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి.

"నిస్సందేహంగా నా వికారపు జల్లులకు కృతి భర్త తమరే!"

"మొన్న ఆ పుస్తకంలో... నా ఫోటో, నా పెళ్ళాం ఫోటో వేసేసి హడావిడి చేసి పోయినావు. అది నా తలకు చుట్టేసుకుంది తెలవక ఇరుక్కుపోయినాను."

"అదేనయ్యా! నాతో నా మొదటి భార్య నిరాకరం ఫోటో పెట్టేసరికి పల్లపుపేటలో ఉంటున్న పంచశీల... నేను మాత్రం ఏం తక్కువ?... ఎంత ఉంచుకున్న దాన్నయినా పెళ్ళాం కాకుండా పోతానా?! నేను తక్కువేంటి అంటూ వారం రోజుల నుండి వచ్చి... రోజూ నా పీక చొక్కాలను టోటల్‌గా పట్టుకుని పీడిస్తోందయ్యా! ఎంత చెప్పినా విని చావడంలేదు. నేను బ్రతికి బట్ట కట్టాలంటే మరో పుస్తకంలో నాతోబాటు తన ఫోటో కూడా పడాల్సిందే... పేర్లలో కనిపించాల్సిందేనంటూ పల్లపుపేట జనాలు పదిమందిని వెంటేసుకొచ్చి మరీ గోల చేసిపోతోంది. ఇవి చేతులు కావు కాళ్ళనుకో!" తన చేతుల్ని పట్టుకొని బ్రతిమాలుతున్న నిర్విరామంగారిని చూస్తూంటే సూరబ్బాయికి

ఏమీ అర్థం కావడంలేదు... పైగా జాలి కల్గుతోంది.

"మీకు ఈ సూరబ్బాయి ఎప్పుడూ అండగా ఉంటాడు.... అంతే కాదు!... దండగాను ఉంటాడు. చెప్పండి!"

"ఇవిగో మరో పాతికవేల రూపాయలు రొఖ్ఖం. ఈసారి ఉప్పుజల్లులు వేస్తావో... మరో పప్పుజల్లులు సంకలనం ప్రచురిస్తావో దానిలో నాతోబాటు పంచశీల ఫోటో పడితీరాలి! లేక పోతే నా శీలాన్ని ఊడపీకి పోతానని హెచ్చ రించి మరీ పోయింది."

'మీకెందుకు అంకులూ!... అన్నింటికీ మీ వెనక నేనున్నాను. వచ్చే 'వేస్టుకార్డులు' కవితా సంకలనం మీకు... మీ పంచశీల ఫ్యామిలీకి టోటల్‌గా అంకితమిచ్చేస్తాను."


"ఫంక్షను అదిరిపోవాల! యం.ఎల్.ఏగారు మరల వచ్చి తీరాల! అది పంచశీల ఆర్డరు."

సూరబ్బాయికి సిత్రంగా ఉంది... భలే మజాగా ఉన్నాది. వెతికిన నూలుతాడు కాలు కు చుట్టేసినట్లయింది. ఆ విషయాన్నే గొప్పగా ముతకరాజుకి ఫోన్ చేసి చెప్పేసినాడు.

తననితాను గిల్లుకున్నాడు. ఆనక గుచ్చు కున్నాడు. తనను పట్టేసిన అదృష్టం తనకు అర్థం కావడంలేదు. అదే విషయాన్ని సూరే కారం దగ్గర గొప్పగా ఏకరువు పెట్టేసినాడు.

మొగుడుని చూసి, మొగుడి చేతిరాతల్ని చూసి మురిసిపోతోంది ఆమె.

✦✦✦




నిర్విరామం గారి రెండో పుస్తక ఫంక్షను మహాగ్రాండ్‌గా జరిగిపోయింది.

మరో దఫా యం.ఎల్.ఏ.గారు అంతే ఉత్సాహంతో దిగిపోయి సన్మానాలు కానిచ్చి పోయినారు.

✦✦✦

"బావా! మన నిర్విరామం మామూలోడు కాదు. మంచి సౌండ్ పార్టీలాగున్నాడు. నీ మూడో పుస్తకం ప్రింటు కావాలంటే ఆయన గారి మూడో ఫ్యామిలీ ఈ ప్రపంచంలో ఎక్క డున్నా సరే వెతికిపెట్టాల్సిందే."

ముతకరాజు ఇచ్చిన సలహా మామూలుగా లేదు. సూరబ్బాయికి మహాగొప్పగా ఉంది.

తన సరదాలు కోరికలు తీరిపోతున్నట్లు న్నాయి. అదే ఉద్దేశ్యంతో ముతకరాజు బావతో కలిసి వెతుకులాటలు మొదలుపెట్టేసినాడు.

మరోవైపు సూరబ్బాయి ఆగడం లేదు. రెచ్చిపోయి చేతికి, చేతిలోని కలానికి పని చెప్పేస్తూనే ఉన్నాడు.

✦✦✦

గుమ్మంలోకి వచ్చిన అతగాడు ఎవరో సూర బ్బాయికి తెలవలేదు. తర్వాత తెలుసుకున్నాడు.


అతగాడు నిర్విరామంగారి పర్సనల్ సెక్ర టరీ మొద్దుమూర్తి.

"అయ్యగారి చేపల చెరువులో గుమాస్తా గిరి చేయడాన్కి మనిషి కావాలట. మిమ్మల్ని వచ్చి ఉద్యోగంలో చేరమన్నాడు. జీతం నెలకు పాతికవేలు. సూరబ్బాయికి మహదానందంగా ఉంది. సూరేకారానికయితే బహు పసందుగా ఉంది.

"మీరు కవితలు రాయడాలు కట్టి పారెయ్యా లన్నది కండీషను... అయ్య గట్టిగా చెప్ప మన్నాడు. ఒప్పుకుంటేనే మీకు చేపల చెరు వుల మీద గుమాస్తా గిరి ఉద్యోగం."

'అంటే ఈ వరుస ఫ్యామి'లీల' గోల నుండి తప్పించుకోవడాన్కి వేసిన పాచిక ఇది!' అర్థం చేసుకుంటూనే ఉన్నాడు.

రొయ్యల చెరువుల మీద గుమాస్తాగిరీ ఉద్యోగం సూరబ్బాయికి అక్కరకొస్తూంటే, ఇన్నాళ్ళూ తనను ముందుకు నడిపించిన అస్త్రాన్ని సన్యసించక తప్పడంలేదు సూరబ్బాయికి.



'అభిమన్యు'- 9440204748

# దొంగగారు

**మిట్టమధ్యాహ్నం...ఎండ చిటపట లాడిస్తుంది. ఆ రోజు శుక్రవారం. జనాలకి సెంటిమెంట్లు ఎక్కువ. నగదు లావాదేవీలు అంతగా జరుపరు. బ్యాంకు ఖాళీగా ఉంది. ముగ్గురో నలుగురో కస్టమర్లు ఉన్నారు. స్టాఫ్ సిస్టమ్ ముందు కూర్చొని కీబోర్డు మీద వేళ్ళను కదిలిస్తున్నారు.**

అప్పుడు 'హేండ్స్ అప్' అని బిగ్గరగా వినిపించింది.

అందరూ తలెత్తి చూసారు. ఎదురుగా ఓ ముసుగు మనిషి డబుల్ బార్ గన్ రెండు చేతులతో పట్టుకొని అందరివైపు చూపిస్తూ 'కాల్చేస్తా... కాల్చేస్తా...' అని జడిపించసాగాడు.

స్టాఫ్ అంతా చేతులెత్తి నిల్చున్నారు.

అంతకుముందే మేనేజరు క్యాబిన్ నుండి బయటకు వచ్చి స్టాఫ్‌తో మాట్లాడుతున్నాడు బిజినెస్ గురించి. ఇదంతా గమనించిన కస్టమర్లు భయంతో నెమ్మదిగా జారుకున్నారు.

ఆ ముసుగు మనిషి క్యాషియర్ దగ్గరికి వెళ్ళి ఒక లెదర్ బ్యాగ్ ఇచ్చి... 'ఇందులో క్యాష్ అంతా పెట్టు' అని గన్‌ని క్యాషియర్‌కి గురిపెట్టాడు. క్యాషియరు పేరు జ్యోతి. ఆమె నేలకి ఐదు అడుగుల పొడవు ఉంటుంది. కుర్చీలో రెండు కుషన్స్ వేసుకుంటే గాని కస్టమర్లు కనిపించరు. ఎమర్జెన్సీ బెల్ మోగించాలంటే దాని స్విచ్ మేనేజర్ కేబిన్‌లో ఉంది. మేనేజర్ ఏమో క్యాబిన్ బయట ఉన్నాడు.

ఇంతలో సేఫ్‌లోంచి సుందరం వచ్చాడు.

సన్నగా గాలిలో ఎగిరే గుర్రంలా ఉంటాడు.

అతను సేల్స్ ఎగ్జిక్యూటివ్. బ్యాంకు తాలూకా స్కీమ్‌లు ప్రమోట్ చేస్తుంటాడు. బ్యాంకు ప్రొడక్ట్సు ప్రజలకి బలవంతంగా అంటగట్టాడు తన వాక్చాతుర్యంతో.

బయటి పరిస్థితి చూసి, విషయం గ్రహించి ఫోన్‌లో మెసేజ్ పెట్టాడు తనకు తెలిసిన నంబర్‌కి. అది గమనించిన ఆ ముసుగు మనిషి "ఏ మేన్ క్యా కర్ రహా హై? ఇదర్ ఆవో.... హేండ్స్ అప్..." అని గన్ సుందరంకి గురిపెట్టాడు.

సుందరం జారిపోతున్న ప్యాంట్‌ని పైకి సర్దుకుంటూ చేతులు పైకెత్తి "భయ్యా యూ వాంట్ ఎనీ హెల్ప్?....!?" అని ధైర్యంగా ఆ ముసుగు మనిషి దగ్గరికి వెళ్ళాడు.

సుందరంని చూసి ఆ ముసుగు మనిషే కాదు, స్టాఫ్ కూడా ఆశ్చర్య పోయారు.

"అందర్ సే గోల్డ్ లావో" అని ఒక బ్యాగ్ సుందరం మీదకి విసిరాడు ఆ ముసుగు మనిషి.

సుందరంకి హిందీ అంతగా రాదు. ఆ బ్యాగు అందుకొని "మీకు తెలుగు రాదా?" అని అడిగాడు.

"నాకు తెలుగు, ఇంగ్లీషు, హిందీ వచ్చు. నేను చదువుకొన్న దొంగని. గో...గో...బంగారం పట్రా!" అని బిగ్గరగా అన్నాడు ముసుగు మనిషి అనబడే దొంగ.

'హమ్మయ్యా! బ్రతికించావ్!' అని గుండెలమీద చేతులు వేసికొని "దొంగగారు... ఒక మాట..." అన్నాడు సుందరం.

"ఏంటి బే..." కోపంగా అన్నాడు దొంగ.

"ఒకవేళ మీకు ఏమైనా అయితే మీ ఫ్యామిలీ పరిస్థితి ఏమిటి...?" అడిగాడు సుందరం.

"అంటే...!" దొంగ ఆశ్చర్యం.

"ఒకవేళ నీకు ఏదైనా ప్రమాదం జరిగి చనిపోతే... మీవాళ్ళ గతి ఏంటి? అందుకే మా బ్యాంకులో ఇన్సూరెన్స్ చేస్తే నువ్వు చనిపోతే నీ కుటుంబానికి కోటి రూపాయలు వస్తాయి..." అని ఆశ చూపాడు సుందరం.

'వీడెవడురా...బ్యాంకును దోచుకోవడానికి వచ్చిన వాడితో తన బిజినెస్ గురించి మాట్లాడు తున్నాడు....' అని చేతులెత్తి నిల్చున్న స్టాఫ్ అంతా సుందరం వైపు కోపంగా చూడసాగారు.

"ఏంటి వాగుతున్నావ్...?" అన్నాడు దొంగ తుపాకీని సుందరం గుండెలకి ఆనించి.

లేని నవ్వును ముఖానికి పులుముకుని, "నిజం దొంగగారు మీకు ఎప్పుడు డబ్బులు కావాలంటే అప్పుడు ఈ కార్డ్ ద్వారా తీసుకోవచ్చు ఎటిఎమ్ లో." అని జేబులోంచి ఓ కార్డ్ తీసి ఆ దొంగకి ఇస్తూ... తలతిప్పి మేనేజర్ వైపు చూసాడు సుందరం.

మేనేజర్ పళ్ళు నూరుతూ కోపంగా



చూసాడు. చేతులు పైకెత్తి నిల్చోవడం వల్ల చేతులు నెప్పి, కాళ్ళు లాగుడు. దగ్గర దగ్గర అందరి పరిస్థితి ఒకేలా ఉంది. క్యాష్ కేబిన్‌లో జ్యోతి మాత్రం ఇస్త్రీ బట్టలు నలిగిపోకుండా బ్యాగులో సర్దుతున్నట్లుగా ఆ దొంగగారు ఇచ్చిన బ్యాగులో క్యాష్ సర్దుతుంది దిక్కులు చూస్తూ.

సుందరంకి ఎక్కుపెట్టిన గన్‌ని దించి, అతను ఇచ్చిన కార్డుని తీసుకొని చూడసాగాడు దొంగగారు... ఇంతలో దొంగగారు పొలమారి దగ్గడం ప్రారంభించాడు....కక్కు వచ్చినా, దగ్గు వచ్చిన ఎవ్వరూ ఆపలేరు. ఆ దగ్గు ఒకంతట తగ్గడంలేదు.

"అయ్యో! ఉండు మంచినీళ్ళు తెస్తాన"ని సుందరం గబుక్కున




మేనేజర్ టేబుల్ మీదున్న వాటర్ గ్లాస్ తీసుకొని–

"తాగండి!" అని దొంగకిచ్చాడు.

"థాంక్స్" చెప్పి ఆ గ్లాసు తీసుకోబోయాడు దొంగ.

అయితే ఒక చేతిలో గన్, రెండో చేతిలో కార్డ్ ఉంది. ఎలా తీసుకోవాలో అర్థం కాక సతమతమవుతూంటే అది గమనించిన సుందరం–

"ఇలా ఇవ్వండి!" అని అతని చేతిలోని గన్‌ని తన చేతిలోకి తీసుకొన్నాడు తెలివిగా.

ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరు... దొంగగారు ఆత్రంగా నీళ్ళు త్రాగుతున్నాడు. సుందరం బుర్రనుపయోగించి, రెండు చేతుల్లోకి శక్తినంతా కూడదీసుకొని దొంగగారి నెత్తిమీద గన్‌తో బలంగా మోదాడు. మరుక్షణం దొంగగారు బాధగా– "అమ్మా!" అని అరుస్తూ తల పట్టుకున్నాడు. అతని చేతిలోని వాటర్ గ్లాస్ నేలను తాకింది భళ్ళుమన్న శబ్దంతో.

ఆ మరుక్షణం తలుపులు భళ్ళున తోసుకుని పోలీసులు రంగప్రవేశం చేసారు.

స్టాఫ్ అంతా ఊపిరి పీల్చుకుని సుందరంను అభినందించ సాగారు.

ఇంతకుముందు సుందరం ఫోన్లో మేసేజ్ పెట్టింది తన ఫ్రెండ్‌కి. తన ఫ్రెండ్ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా చేస్తున్నాడు.

ఇంతకీ ఆ దొంగగారు మరెవరో కాదు ఆ బ్యాంకు సెక్యూరిటీగార్డు.


# నెల నెలా నవ్వుల వెన్నెల




**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతి నెలా ఒక అంశం మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.

## ఈ నెల అంశం- రేటింగ్ బాబోయ్... రేటింగ్!


నిర్వహణ: **లాల్**























అరిసెలు.
1
బొబ్బట్లు.
2
మిఠాయిలు.
3
శ్రీ సంక్రాంతి పిండివంటల రేటింగ్.



అన్నా! థియేటర్ లో అందరూ స్పృహ తప్పినట్టున్నారే!
Running show
ఈ ఏటి మేటి చిత్రం
BALCONY
Mani



నా లవ్‌కు ఎంత రేటింగ్ ఇస్తావ్ డార్లింగ్...


సార్ మీ ఫోనుకి ఓ లింక్ వచ్చి ఉంటుంది... కొంచెం పాజిటివ్ ఫీడ్ బేక్ ఇవ్వండి సార్
నరకం


UMA 75 MM
TALKIES
ఈ సినిమాకి రేటింగ్ ఎంతిస్తారు


ఈ స్టెనోని గ్రామర్ చూసి తీస్కోమన్నాను, గ్లామర్ చూసి కాదు! ఒక్క లెటర్ సరిగ్గా చేసి చావదు...


ఈ వీధిలో మీ కూరలకి 5/0 రేటింగ్ ఇవ్వాల్సి వస్తుంది..ఇకనుండైనా కాస్త కమ్మగా వండి పెట్టండి తల్లే..?!


వామ్మో ఏదో డేటింగ్ చేద్దామంటే వచ్చా! 'రేటింగ్' ఇవ్వమంటుందేంటి? నేను జంప్!!




ఈ నెల రచయితలు: ✦ డా॥ శ్రీమతి చివుకుల పద్మజ ✦ తాడేపల్లి అనంతలక్ష్మి

### పందొమ్మిదవ సీన్– డా॥ శ్రీమతి చివుకుల పద్మజ

(గత సంచిక తరువాయి)

కార్పొరేటర్ ఇంట్లో...

శేషాచలం, గణేష్, సురేష్ భేటీ...

“ఓ బాపూ! మల్ల బిల్చి తక్లీఫ్ ఇచ్చిన. నా పోరడు లొల్లిబెడతాండు. నువ్ గా మహేష్ గాన్ని ఇలను జేశేషి మావోన్ని హీరో జెయ్యాలె!” సూటిగా పాయింట్లో కొచ్చాడు కార్పొరేటర్ గణేష్.

“నువ్ గని నా మాట ఇన్లేదనుకో...మీ ఫ్లాట్ల కెళ్ళి వచ్చే పాయిఖాన గొట్టాలకి పర్మిషన్ లేదని లైన్ కట్ జేపిస్తా... పాయిఖాన లైన్లు బీకేస్తే, పేపర్ల తోడి పని గానివ్వాలె. పబ్లిక్ పరేషాన్ అయ్యి నీ పిలక పీకేది పక్కా. ఖేల్ ఖతం, దుకాన్ బంద్ లెక్క అయితది ఇంక నీ సైన్మ. యాది పెట్టుకో, పెద్దమనిసీ!” విలాసంగా వార్నింగ్ కూడా ఇచ్చాడు.

శేషాచలం గుండెల్లో పెద్ద కొండ రాయి పడ్డది.

‘మహేష్‌ను కాదని సురేష్‌ను హీరో చెయ్యడం ఎలా? పైగా మహేష్ – ప్రతిభల కైతే వేపపళ్ళు, మిరపప్పళ్ళు సరిపోతాయ్ గానీ, వీడ్ని హీరో చెయ్యాలంటే పనసపళ్ళు తేవాలి. అబ్బే! పనసపళ్ళు, మిరపప్పళ్ళ కాంబినేషన్ బాగోలేదు. కాదంటే పాయిఖాన లైన్లు పీకిస్తాడట... మా పాయిఖానాలు పీకితే వీడికి పైల్స్ వస్తాయ్. తిక్క కుదురు తుంది.’ మనసులో పిల్లిశాపాలు పెట్టుకుని ఏం చెయ్యాలని తీవ్రంగా ఆలోచించాడు.

కరెంటు ఖర్చు లేకుండా ఠక్కున బల్బు వెలిగింది శేషాచలం బుర్రలో.

**ఫ్లాష్‌బ్యాక్**

శేషాచలం పదవీ విరమణ చేశాక, వచ్చిన డబ్బులలో మిగిలిన ఓ లక్ష రూపాయతో తన చుట్టూ ఉన్న వాళ్ళని వాడుకుని ఒక చిన్న ఓటీటీ సినిమా తియ్యాలన్న ఉద్దేశంతో పరిచయస్థులను వాడుకునే క్రమంలో...

“అది కాదండీ! ఈ రోజుల్లో హీరోలకంటే విలన్లకే పేరు బాగా వస్తోంది... మొన్నటికి మొన్న ఆ తమిళ విలన్ ‘కుట్టాయప్ప చోళన్’ చూడండి. ఇట్లా విలన్ వేషం కట్టాడు తెలుగులో, అట్లా హీరో వేషాలు వర్స కట్టాయి... అదే సినిమా హీరోని చూడండి...సినిమాలు పోయి వేషాలు వెతుక్కుంటున్నాడు. కనుక అబ్బాయికేం తెలుసు కుర్రకుం... పెద్దవాళ్ళు మీరు ఒప్పించండి. మంచి భవిష్యత్తు వుంది అబ్బాయికి!” నచ్చచెప్తున్నట్లు అన్నాడు శేషాచలం.

“అరె!... ఏందివయ్యా...కుంక.. టెంక... అన్కుంట ఇజ్జత్ ఖరాబ్ జేస్తున్నవ్ నా ఖాందా న్లల్ల” సీరియస్ అయ్యాడు గణేష్.

“అయ్యో! అది తిట్టు కాదు... అది నా అలవాటు, కుర్రోళ్ళని ముద్దుగా అలా అంటా, అంతే!!” సోఫా లోంచి లేచి సురేష్ బుగ్గలు నిమురుతూ చెప్పాడు శేషాచలం.

“వెధవ గరుకు బరుకు గడ్డం వీడూనూ,

చెయ్యి దోక్కుపోయింది.' మనసులో వంద తిట్లు తిట్టుకున్నాడు.

గణేష్ సాలోచనగా చూశాడు కొడుకు వైపు.

అర్థం చేసుకున్నాడు సురేష్. వెంటనే "గయితే నాకు ఫైట్లే కాదు! పాటలు భీ గావలె నాయనా!" మారాం చేశాడు.

"హూఁ! సరే తీయ్... ఇదిగో డైరెక్టూ! ఐతే మార్చేయ్... కథ మార్చెయ్. మా పోరడి కారెక్ట్రు (స్ట్రాంగ్ వుండాలే. నాలుగైదు పాటల్ బెట్టు. ఈరోయిన్కు ఇలన్కూ పెండ్లి జెయ్. అట్ల కాపోతే నా కార్పొరేటర్ సీటు ఇజ్జత్ బోతది. ఇలను మాత్రం ఓడిపోవద్దు. ఇగ పో!"

'కథ మార్చాల్ట కథ...' తిట్టుకుంటూ– "బాబు భవిష్యత్తు నా చేతిలో పెట్టండి, నేను చూసుకుంటా!"వినయంగా వంగీవంగకుండా దణ్ణం పెట్టి బయలుదేరాడు శేషాచలం.

✦✦✦

ఇంటికొచ్చేసరికి శేషాచలం పిన్ని ఒకామె వూరి నుండి వచ్చి వుంది.

పిల్లలు లేకపోవడటంతో అక్క కొడుకైన శేషాచలాన్ని చేరదీసింది అందరికన్నా చిన్నదైన రాజ్యం. స్వంత కొడుకులాగానే చూసుకుంది. వయసు ఎనభైల్లో పడ్డా కంటి పదును, పంటి పదును తగ్గలేదు. కాస్త చెవుడు మాత్రం మొదలవుతోంది ఈ మధ్య. భర్త పోయినా వూరుని మాత్రం వదలక, పై ఎత్తున పాలేరు కుటుంబం సహాయంతో జీవితం గడుపుతూ వుంటుంది, మధ్యమధ్యలో శేషాచలం ఇంటికి వచ్చి వెళుతూ వుంటుంది. శేషాచలం సంబంధం తనకు కుదిర్చింది ఆవిడే కావటంతో కాంతానికి ఆవిడంటే అభిమానం. ఎటూ ఆవిడ ఆస్తి తర్వాత్తర్వాత తమదే అనే ధైర్యం మరోటి.

పిన్నిని పలకరిద్దామని వెళ్ళబోతూ జరిగింది అంతా చెప్పాడు కాంతానికి.

"ఐతే ఇంక నటానటీ మణుల్ని పోగేసింది చాల్లే గానీ, సిన్మా మొదలు పెట్టండి."

"నేనూ అదే అనుకుంటున్నా. కథ సంగతి చిన్నగా ఆలోచిస్తా... ముందైతే కాబట్టిన మటుకు కానిచ్చేస్తా. లేటు చేస్తుంటే కొత్త కొత్త పాత్రలన్నీ వస్తున్నాయ్!"

"ఏంటిరా శేషం! పాత్రలా?... పనిపిల్ల అన్నీ సుబ్బరంగా కడిగి బోర్లించి పెట్టిందిగా!" హాల్లోకి ఎంటరైంది రాజ్యం.

"పిన్నీ! నీ సగం చెవుడు మధ్యలో. అవి మామూలు పాత్రలు కావు, సిన్మా పాత్రలు!" కాస్త గట్టిగా చెప్పాడు.

"సినిమా తీస్తున్నావటగా చలం. కాంతం చెప్పిందిరా అన్ని కబుర్లు. మహేష్, రమేష్, గణేష్, సురేష్ .. పేర్లు ప్రాసగా వున్నాయిరా.. శేష్!" తను కూడా ప్రాస వదిలింది.


శేషం, చలం, శేషాచలం, అబ్బాయ్...ఆవిడ శేషాచలాన్ని ముద్దుగా పిలుచుకునే పేర్లివి. సినిమా పుణ్యమా అని కొత్తగా 'శేష్' అని కూడా పిలుస్తోంది ఇప్పుడు.


పిల్లలు దగ్గర లేక, ఏర్పడిన శూన్యాన్ని ఇలా కవర్ చేసుకుంటున్నాదని కాస్త బాధ పడింది గానీ... కొడుకు మనోనిబ్బరాన్ని మాత్రం మెచ్చుకోలేకుండా వుండలేకపోయింది.

గణేష్ వార్నింగో, ఇంకోటో కానీ సినిమా వెంటనే మొదలు పెట్టేయాలన్న కసి పెరిగింది శేషాచాలానికి.

"ముందు పాటలు తీస్తా. ఎంత ఓ టీ టీ సిన్మా అయినా షూటింగ్ అంతా అయ్యేలోపు ఫీలర్లు వదుల్తా" చేతులు తిప్పి మరీ ఆవేశపడ్డాడు శేషాచలం.

"ఏంటీ పీలరా! కొత్తది తేరా. పాతది సరిగ్గా పని చేసి చావట్లేదు. అసలే రేపు ఆలుగడ్డ చిప్పు ఎండబెట్టాలంటోంది కాంతం."






"ఫీలర్ కాదు...ఫీలర్! ఫీలర్!!... నీకు తెలీదులే ఊర్కో పిన్నీ!" విసుక్కున్నాడు శేషాచలం.

"నాకు తెలీదా? చాలులే సంబడం. చిక్కు వెంట్రుకల నించీ విమానాలు నడిపేదాకా అన్నీ తెలుసు నాకు. మీ బాబాయి గారు ఎంత ఇదిగా అనేవారో...'రాజ్యం! నీకు తెలియనిది లేదే... భారతదేశాన్ని యేలే తెలివితేటలు వున్నాయి..' అని!" కళ్ళొత్తుకుంది.

"రెండు పాటలు పెడతా. ఒకటి ఆల్రెడీ రాసేసా. హీరో హీరోయిన్ల మధ్య మిరపపుండ్ల పాట. ఇంకోటి విలను హీరోయిన్ వెనక పడి పాడే పాట!" ఉత్సాహంగా లేచాడు శేషాచలం.

ఎలాగైనా సినిమా మొదలు పెట్టేయ్యాలన్న సంకల్పంతో, పెన్నూ పేపరు తీసుకుని అలవోకగా రాసేసాడు పాటొకటి.

సురేష్: నువ్వు మా అమ్మేసిన ఎర్రెర్రని అట్టుశ్రీ
నిన్ను నేనొదిలితే ఒట్టు మీద ఒట్టుశ్రీశ్రీ
నువ్వే నాకిష్టమైన దోశాశ్రీ
నాకేసి చూస్తావనే నా ఆశాశ్రీశ్రీ
నువ్వే నా జాంకాయాశ్రీ
కాదంటే నా పని అయిపాయాశ్రీశ్రీ
నువ్వు మా అమ్మేసిన ఎర్రెర్రని అట్టుశ్రీ
నిన్ను నేనొదిలితే ఒట్టు మీద ఒట్టుశ్రీశ్రీ

సురేష్ పాట పాడుతూ ప్రతిభ వెనక పడతాడన్నమాట.

✦✦✦

పాట రాయటమే కాదు... భైరావిని పట్టుకుని రకరకాల ట్యూన్లు కట్టించాడు. చివరికొక ట్యూన్ ఫైనల్ చేసుకున్నాడు. సింగర్ ఎవరన్నది సమస్య వచ్చి పడింది.

"పాట విలన్ మీద అంటున్నావ్ కాబట్టి నా గొంతు బాగా సూట్ అవుతుందిరా. నేను పాడేస్తా! అట్లా పాడే మ్యూజిక్ డైరెక్టర్స్ ఉన్నార్రా మన ఫీల్డులో" బతిమాలేడు భైరావి.

శేషాచలం తల వూపటమేమీ, భైరావి పాడటమేమీ...సాంగు రికార్డింగు నిరాటంకంగా జరిగిపోయింది.

ఏకనాథం చేత కెమెరా అద్దెకు తెప్పించి షూటింగ్ మొదలెట్టేసాడు శేషాచలం.

తన పాత మోడల్ కెమెరా వద్దన్నాడని కాస్త గింజుకున్నాడు ఏకనాథం కానీ తప్పలా.

పెద్దగా హడావిడి చెయ్యకుండగానే ... ముహూర్తం షాట్ కొట్టి సురేష్, ప్రతిభల మీద షూటింగ్ మొదలు పెట్టేశాడు. పట్టుచీరలు కట్టుకుని ముహూర్తం షాట్లో హడావిడి చేయాలనుకున్న ఆడలేడీస్ గ్యాంగు, మూతి ముడిచినా శేషాచలం అస్సలు పట్టించుకోలేదు. ముందు పాటల షూటింగు మొదలుపెట్టాలి, ఆనక... ఆ సురేష్ పాత్రని (స్టాంగ్ ఎట్లా చెయ్యాలో ఆలోచించాలి. ఇదే పట్టుదల మీద వున్నాడు శేషాచలం.

కాలనీ రోడ్ల మీద ప్రతిభ వయ్యారంగా నడుస్తూ వుంటుంది... ఎర్ర టాపు, బులుగు లెగ్గిన్సు వేసుకుని. సురేష్ వెనకపడుతూ... ప్రతిభ మీద బంతి పూలు చల్లుతూ పాట పాడాలి... అదీ సీను.

ప్రతిభ నడిచే స్పీడు చూసుకోకుండా, తెగ స్పీడుగా వెనక నుంచి పరిగెత్తుకొస్తున్నాడు సురేష్. నిమిషంలో పరిగెట్టుకొచ్చి ప్రతిభ మీద పడిపోతున్నాడు.


షూటింగ్ చూస్తున్న ఒకామె "ఆడేంది? ఎర్రగుడ్డ చూసిన ఎద్దులాగా ఉర్కుతున్నడు!" అన్నది.

విన్న శేషాచలానికి చిరాకొచ్చింది.

"కాస్త చిన్నగా ఉరుకు బాబూ!" అన్నాడు.


అయినా అంతే. ఏకనాథం ఇద్దర్నీ కవర్ చెయ్యలేక ఛస్తున్నాడు.

మళ్ళీ మొత్తుకున్నాడు శేషాచలం.



"చస్! ఇట్టాక్కాదు తియ్. గదేందో రైలు పట్టాలుంటయి సూడు. గవి తే! గప్పుడు నేను పరిగెత్తే పనుండదు... కానీ యెనక మాత్రం పడినట్లుంటది" సగంలో ఆపేసి అలిగి వెళ్ళిపోయాడు సురేష్.

"పడింది...గండి పడింది. ఇంక ఈ షూటింగ్ సాగేదెలా?" శేషాచలం తల పట్టుకున్నాడు.




## ఇరవైయవ సీన్–
## తాడేపల్లి అనంతలక్ష్మి

బాగా కాలిన ఎర్రని అట్టులా మొహం పెట్టుకుని, ఇంటికొచ్చి సోఫాలో కూల బడ్డాడు శేషాచలం.

పక్కనే ఉన్న తన 'ఎన్సైక్లోపీడియా బ్రిటానికా' ను హత్తుకుని, పసిపాపలా నిమరసాగాడు.

"అదేవిటీ!... నేను పోచంపల్లి పట్టుచీర కట్టుకుని వద్దామనుకుంటుంటే... అప్పుడే షూటింగ్ సర్దేశారా?'' ఆశ్చర్యపోతూ అడిగింది కాంతం.

మరోపక్క రాజ్యం పిన్ని హాల్లోకి వచ్చి–

"కాంతం! నీ పోపులు తరవాత! అబ్బాయ్‌కి దిష్టితీసి, భోజనానికి అన్నీ బల్ల మీద సర్దు. అసలే వాడు పచ్చిపులుసులోకి గుమ్మడి వడియాలు, ఆలుగడ్డ చిప్సు అంటే పడిచస్తాడు. ఊ! త్వరగా కానీ!"... అంటూ, విక్టోరియా మహారాణిలా ఆర్డరు వేసింది.

"ఆపు పిన్నీ!!" గదంతా రీసౌండ్ వచ్చేలా కెవ్వుమన్నాడు శేషాచలం.

కాంతం, రాజ్యం పిన్ని అదిరిపోయి... కొయ్యబొమ్మల్లా బిర్ర బిగుసుకు పోయారు.

"అసలే సురేష్‌తో తిప్పలొచ్చి, షూటింగ్ ఆగి, కుడితిలో పడ్డ ఎలుకలా గిల గిల్లాడు తుంటే... పోచంపల్లి, చిప్సు అని నా ప్రాణాలు స్ట్రా వేసుకు మరీ పీల్చేస్తున్నారే!" కస్సుబుస్సు మన్నాడు శేషాచలం.

✦✦✦

కార్పొరేటర్ ఇంట్లో శేషాచలం, గణేష్, సురేష్ సమావేశమయ్యారు.

"డైరెక్టరు సారూ, ఏందివయా! గిట్ల సత్నాష్ జెయ్యవడితివి? మా పోరగాడు పొద్దుగుంకులు ఉర్కుడేనా?... సైన్మల పాటలంటే, మస్తుగ సిరంజీవి లెక్క స్టెప్పులుండాలే... దమాక్ గిట్ల కరాబ్ అయిందా?" బెదిరింపుగా అడిగాడు గణేష్.


"సార్! పాట విలన్‌కి హీరోయిన్‌కి మధ్య కాబట్టి, వెరైటీగా ఉంటుందని నేనే అలా ప్లాన్ చేశా!" మెల్లిగా చెప్పాడు శేషాచలం.

గణేష్ తన కొడుకువంక చూస్తూ...

"సర్లె! గవేందో రైలు పట్టలంట దెప్పియ్!" అంటూ, లేవబోయాడు.

'వీడి మొహం మండ! షూటింగ్ ట్రాక్‌కి, రైలు పట్టాలకి తేడా తెలీని వెధవన్నర వెధవ! చదువులేని చుంచు మొహం వీడూను' అని కోపం దిగమింగుకుంటూ...

"సార్ మనది లోబడ్జెట్ సినిమా. అదీ... మరీ...'' అంటూ నీళ్ళు నమలసాగాడు శేషాచలం. **(సశేషం)**





'బామాశ్రీ'-9492260018

# బోణీ... రాజుగారి బోణీ

**బంగార్రాజు రూపం చూడగానే ఎవరికైనా నవ్వు ఆగదు. ఆయన శరీరం ఒక 'నడిచే అద్భుతం'. ఆరు అడుగుల పొడవు ఉండాల్సిన మనిషిని ఎవరో పైనుంచి గట్టిగా నొక్కినట్టు ఐదు అడుగులకే పరిమితం అయిపోయాడు. ఇక ఆయన పొట్ట...అది ఒక సెపరేట్ జిల్లా లాగా ముందుకి పొడుచుకు వచ్చి ఉంటుంది. ఆయన నడుస్తుంటే పొట్ట ముందే ప్రయాణం మొదలుపెడుతుంది, రాజుగారు ఒక రెండు సెకన్ల తర్వాత వెనకాల వస్తుంటారు. ఆయన కట్టుకునే పంచె ఎప్పుడూ నాభి కింద 'డేంజర్ జోన్'లో వేలాడుతుంటే... దాన్ని సర్దుకోవడమే ఆయన నిత్యకృత్యం. ఆ ముక్కు కింద ఉన్న మీసం, ఎవరో రాత్రిపూట కావాలని పెయింట్ వేసినట్టు చిన్నగా, చిలిపిగా ఉంటుంది.**

అయినా సరే, బంగార్రాజు తన భార్యను మాత్రం ఎంతో ప్రేమగా "పిల్లా" అని పిలుస్తాడు. అది ఆయన అమాయకత్వమో లేక తన పర్స నాలిటీకి ఆ పేరే సెట్ అవుతుందన్న నమ్మకమో ఎవరికీ తెలియదు.

ఊర్లో ఆయనకున్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఆయనకి 'చేతివాటం' ఎక్కువని పేరు. అంటే దొంగతనం కాదు సుమా... ఆయన చేత్తో ఏ వస్తువు ముట్టుకున్నా... అది క్లిక్ అయిపోతుంది. అందుకే ఊరంతా అతన్ని ముద్దుగా 'బోణీ రాజు' అని నామకరణం చేసేశారు.

ఆ ఊరిలో ఏ వ్యాపారం మొదలవ్వాలన్నా ముహూర్తం కంటే ముందు రాజుగారికి కబురు వెళ్లాల్సిందే. కొత్తగా పెట్టిన కిరాణా షాపులో మొదట కేజీ బెల్లం ఇతనే కొనాలి. ఆ బెల్లం ప్యాకెట్ పట్టుకుంటే ఆయన పొట్ట మీద పడి జారిపోతుందేమోనని షాపు యజమానికి గుబులు! బట్టల కొట్టులో మొదటి రుమాలు ఇతనే కొనాలి. ఎవరైనా కొత్తగా ట్యూషన్ సెంటర్ పెడితే, మొదటి చాక్ పీస్ ఇతని చేత్తోనే డబ్బాలో నుంచి బయటికి తీయాలి.

ఒక్క మాటలో చెప్పాలంటే, ఊర్లో పాన్ షాపు నుంచి పంచాయతీ కాంట్రాక్ట్ వరకూ 'బోణీ రాజు రాకుండా గల్లా పెట్టె తెరవద్దు' అనేది ఒక రాసి లేని అలిఖిత రాజ్యాంగ చట్టం.

పక్క ఊర్ల నుంచి కూడా ఆయనను ప్రత్యేకంగా, టైర్లు కిర్రుమన్నా సరే ఒక పెద్ద ఆటోలో తీసుకెళ్లి... బోణీ చేయించుకుని సంతోషంగా పంపిస్తుంటారు.

ఇలా రాజుగారి హవా సాఫీగా సాగుతున్న రోజుల్లో, ఊరిలో ఒక పెద్ద బాంబు పేలింది.


చిత్రిక అనే యువతి ఊరి శివార్లలో ఒక 'నిశా వినోద కేంద్రాన్ని' ప్రారంభించబోతుందన్నదే ఆ వార్త! దాని అసలు రూపం ఏమిటో అందరికీ తెలుసు కానీ, బయట బోర్డు మీద మాత్రం 'సంగీత-నాట్య కళా కేంద్రం' అని రాసి... సరస్వతీ దేవి బొమ్మ పెట్టారు. ఆ బొమ్మ కూడా పాపం అక్కడి వాతావరణం చూసి సిగ్గుతో తలవంచుకున్నట్టు కనిపించింది.

వ్యాపారం ప్రారంభానికి ఊరిలోని 'పెద్ద మనుషులు' ఒక్కొక్కరు ఒక్కో రకమైన ఉత్సాహాన్ని ప్రదర్శించారు. "రిబ్బన్ కట్ చేసే ఛాన్స్ నాకే ఇవ్వాలి... నాకు కత్తెర పట్టుకోవడం అలవాటు" అని ఒకడంటే, "అసలు దీపం నేను వెలిగిస్తేనే ఆ వెలుగు వేరు..." అని ఇంకొకడు పోటీ పడ్డాడు.

చివరకు ఒక ముసలాయన పంచె మడత సరిచేసుకుని, పొగాకు నములుతూ గంభీరంగా తీర్పు ఇచ్చాడు.

"అమ్మా చిత్రికా!... నీ ఈ 'నిశా వినోద కేంద్రం' చీకటి పడితే మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లాలన్నా, లోపలికి వచ్చే జనం తాకిడి తట్టుకోలేనంతగా ఉండాలన్నా, కచ్చితంగా మన బోణీ రాజు చేతే కొబ్బరికాయ కొట్టించాలి. ఆయన పొట్ట తగిలితే చాలు... గల్లా పెట్టె నిండిపోవాల్సిందే!"

"నిశా వినోద కేంద్రం" సమాచారం చేరగానే బోణీ రాజు ముఖం వెలవెలబోయింది. ఆ మీసం టకటకలాడింది. "నేను రాను! నిశా వినోదం అంటేనే నిషాలో ఉండే వ్యవహారం. నేను నా భార్యను 'పిల్లా' అని పిలుచుకునే పవిత్రుడను. నా బోణీ మహిమను తీసుకెళ్లి ఇలాంటి చోట వాడతారా? రేపు నా పిల్లా మొహం ఊరి జనం ముందు ఎలా చూపించాలి?" అని అడ్డంగా తలూపాడు.



కానీ ఊరి పెద్దలు వదల్లేదు.

“అయ్యా రాజా! నువ్వు లోపలికి వెళ్లి డాన్సులు చేయక్కర్లేదు. కేవలం బయట గుమ్మం దగ్గర ఒక కొబ్బరికాయ కొట్టి, నీ మంగళకరమైన పొట్టను ఒకసారి చూపించి వచ్చేయ్ చాలు” అని బ్రతిమాలారు.

చిత్రిక కూడా కన్నీళ్లతో విజ్ఞప్తి చేయడంతో, రాజు గారు ఒక షరతు పెట్టాడు.

“నేను లోపల అడుగు పెట్టను... ఒక్క పైసా తాకను... బయట కొబ్బరికాయ కొట్టి, నా పిల్లా మీద ఒట్టు వేసి గాలి వేగంతో వచ్చేస్తాను!”

ప్రారంభోత్సవం రోజున ఆ కేంద్రం ముందు జాతర మొదలైంది. రంగురంగుల లైట్లు, అత్తరు వాసనలు... జనం మాత్రం పండగరోజున బస్టాండ్ దగ్గర ఉన్నంత మంది ఉన్నారు.

బోణీ రాజు గంభీరంగా పొట్టను ఆడిస్తూ, నడుచుకుంటూ వచ్చాడు. చేతిలో కొబ్బరికాయ పట్టుకుని, అక్కడున్న పెద్ద మనుషుల వైపు ఒక వెటకారపు చూపు చూసి ఇలా అన్నాడు.

పిల్లలు కూడా తలవంచుకోవాలా? లోకాన్నంతా బోణీ చేసే నీ చేత్తో ఇలాంటి మురికి గుమ్మం దగ్గర కొబ్బరికాయ కొడతావా?”


అందరి వైపు తిరిగి ఆమె పదునైన స్వరంతో కొనసాగించింది.

“ఈ ఊర్లో చాలామంది బోణీ పేరుతో బుద్ధి అమ్ముకుంటున్నారు. కానీ నా భర్త ఏ రోజూ అడ్డదారులు తొక్కినవాడు కాదు. ఈ ఒక్క కొబ్బరికాయ కొడితే వీళ్ల గల్లా నిండుతుందేమో గానీ, నీ మీద నాకున్న గౌరవం కాలిపోతుంది మావా! పద ఇంటికి!”

రాజు గారి కళ్ళు చెమ్మగిల్లాయి.

ఆ భారీ పొట్ట వెనుక ఉన్న చిన్న పిల్లాడి లాంటి అమాయక మనసు ఆమె మాటలకు కరిగిపోయింది.

ఆయన కొబ్బరికాయను అక్కడే నేల మీద పక్కకు పెట్టేసి, “ఈ రోజు బోణీరాజు బోణీ కాలేదు... ఈ రోజు నా పిల్లా గెలిచింది! నా పేరు మీద బోణీలు ఆగిపోయినా పర్వాలేదు కానీ... నా పిల్లా తలవంచుకునే పని మాత్రం నేను చేయను!” అని నిర్భయంగా అన్నాడు.



“ఈ కొబ్బరికాయ ఇక్కడ పగలగొడుతున్నాను గానీ... నా పవిత్రతను కాదు! మీరు లోపలికి వెళ్ళండి... నేను ఇంటికి వెళ్తాను!”

అతను కొబ్బరికాయ కొట్టబోయే క్షణంలో “ఆగండి రాజూ మావా!” వెనుక నుంచి ఓ స్థిరమైన గొంతు.

అందరూ తల తిప్పారు. అది ఆయన భార్య ‘పిల్లా’.

చీర కాస్త మోకాళ్లకు తాకేంత ఎత్తులో కట్టి... నడకలో తొందర లేదు... భయం లేదు... అడుగుల్లో ఆత్మవిశ్వాసం ఉంది. ఆమె వస్తుంటే జనం సముద్రంలా చీలిపోయారు.

ఆమె నెమ్మదిగా రాజు దగ్గరకు వచ్చి... ఆయన పంచెను ఒకసారి గట్టిగా లాగి సరిచేస్తూ కోపంగా అంది–

“రాజూ మావా!... నువ్వు నన్ను పిల్లా అని పిలుస్తావని ఊరంతా తెలుసు... కానీ నువ్వు చేసే ఈ పనుల వల్ల రేపు నాకు పుట్టబోయే

రాజు గారు తన పంచెను ఒక్కసారి గట్టిగా సర్దుకుని, భార్య వెనుక నడుస్తుంటే...


ఇప్పుడు ఆయన పొట్ట కంటే ఆయన గర్వమే ముందు నడుస్తున్నట్టు అనిపించింది.


వెలుగుతున్న లైట్లు, అర్థం లేని మ్యూజిక్, మరి నోట్లోని పొగాకు దిగమింగలేక బిత్తరపోయిన పెద్ద మనుషుల దిగులు ముఖాలు వెనుక నుండి వెలవెలబోయాయి.


కొన్ని వ్యాపారాలు కొబ్బరికాయ కొట్టడంతో మొదలవుతాయి... కొన్ని వ్యాపారాలు కొబ్బరికాయ కొట్టకుండానే బట్టబయలవుతాయి.


# నేస్తం, ఆకాసం సంయుక్తంగా నిర్వహించిన కార్టూన్ పోటీలో


## బహుమతి పొందిన కార్టూన్లు






















జాషువ సాంస్కృతిక వేదిక
మరియు
ఆకాసం నిర్వహిస్తున్న
**కుల రహితం– సమాజ హితం**
అంశంతో నిర్వహిస్తున్న కార్టూన్ పోటీ
10 బహుమతులు 1000 రూపాయలు చొప్పున
కార్టూన్లు చేరవలసిన ఆఖరి తేదీ & పంపవలసిన మెయిల్
7th April,2026 / sreedhar.annam@yahoo.in
బహుమతి ప్రదాన సభ– 11,ఏప్రిల్,2026న , సా॥ 6గంటలకు
జాషువ సాంస్కృతిక వేదిక, బాలోత్సవ భవన్, విజయవాడలో నిర్వహించబడుతుంది.
Cartoon Exhibition at 4pm / Dinner Follows

# Reverse Gear
# వెనక్కి వెళ్ళే కథలు

గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969

## పెళ్ళిచూపుల లొల్లి

**"మరోసారి, ఇంకోసారి బాగా అలోచించుకుని చెప్పండి... మనం వెనక్కి వెళ్ళాల్సిందేనంటారా? లేక మనబ్బాయి మాడు మొహం చూసి మనసు మార్చు కుంటారా?" అడిగింది లక్ష్మమ్మ.**

**"ఆలోచించుకున్నా, చొక్కా చించుకున్నా నా మాట అదే. వాడి వాడిపోయిన మొహం చూసి నా మనసు గాడి తప్పదు. వెనక్కి వెళ్ళాల్సిందే!" చెప్పాడు సుబ్బారావ్**

"మీరు ఎర్రగా చూస్తున్నా, నాకది వెర్రితనంగా అనిపిస్తోంది. సీరియస్‌గా అంటున్నారా... సిల్లీగా అంటున్నారా..." మరోసారి సూటిగా చూస్తూ అడిగింది.

"ఈ టైంలో సిల్లీగా ఎవరు మాట్లాడతారే గండుపిల్లి మొహం దానా! సీరియస్సే!!" చెప్పాడు కరాకండిగా.

సుబ్బారావ్ మాటలు విన్నాక... అతని వైపు జాలిగా మొహం పెట్టి చూస్తూ- "పొద్దున్న అల్మరా తలుపుకి మీ తల మరీ గట్టిగా తగిలిందా? పర్లేదులెండి... తగ్గిపోతుందిలెండి!" అంది తలమీద చేయిపెట్టి కుక్క పిల్లని నిమిరినట్టు నిమురుతూ.


సుబ్బారావ్‌కి ఒళ్ళు మండి... "చెయ్ తియ్ తింగరి మొహావా! అంటే, తలుపుకి తల తగిలి ఇలా మాట్లాడుతున్నాననా?... పైగా మన టామీని నిమిరినట్టు నిమురుతావా?" కస్సు బస్సులాడుతూ అన్నాడు.

"మీకంటే మన టామీ తెలివైనదేమో అనిపిస్తుంది కొన్నిసార్లు."

"అవును! నీ బుద్ధి వంకర కన్నా,దాని తోక వంకరే చిన్నది!" కోపంగా బదులిచ్చాడు.

లక్ష్మమ్మ కొంత శాంత పడి... "లేకపోతే ఏంటి చెప్పండి!... మనబ్బాయి ఆ అమ్మాయి ఫోటో చూసి... పీకల దాకా ఇష్టపడ్డాడు. ఆ అమ్మాయితో పెళ్ళి చేయమని సిగ్గుపడ్డాడు. పెళ్ళిచూపులు చూడ్డానికి తొందరపడ్డాడు... దాంతో ఇపుడు శుభవాని ఇలా మనం పెళ్ళి చూపులకి కూడా వెళ్తున్నాం. దిగాల్సిన అమ్మాయి వాళ్ళ ఊరు, వచ్చే రెండో స్టాపే. అలాంటిది వస్తున్న స్టాపులో బస్సు దిగి వెనక్కి వెళ్ళిపోదాం అంటారేవిటి ఖర్మ!" తల టప టపా కొట్టుకుని..."ఛ! ఛ!! అనవసరంగా తల కొట్టుకున్నాను..." అంది బాధగా


"ఏం తల నొప్పి పెట్టిందా?" అడిగాడు సుబ్బారావ్.



"కాదు, చేతికి సిందూరం అంటుకుంది." చెప్పి, మరుక్షణం "వెనక్కి వెళ్లడం ఖాయమా?" అంది...తన కొడుకు వైపు చూస్తూ.

"నేను మెంటల్‌గా ఫిక్స్ అయిపోయాను! నువ్... సెంటిమెంటల్ డ్రామాలు ఆపితే మంచిది. నాకెందుకో ఈ పెళ్ళి చూపులకి వెళ్ళ బుద్ధి కావడం లేదు. అమ్మాయి తండ్రి, మన ఆస్తి, అంతస్తు, వెండి, బంగారం, మన వాడి జీతం, జీవిత భీమా పాలసీ వివరాలు మాత్రమే అడిగాడు. మన కుటుంబం, వగైరా గురించి ఒక్క ముక్క అడగలేదు. మనవాడు, అమ్మాయి నచ్చింది అని అన్నాడనీ, మధ్యవర్తి ఓ సారి పెళ్లిచూపులకి వెళ్ళి రండి అన్నాడని ఇలా బయలుదేరాను... ఇప్పుడు కూడా అమ్మాయి తండ్రి ఫోన్ చేసి, బస్సులో వస్తున్నారా? కారు మీద వస్తున్నారని అనుకున్నాను అన్నాడు తెలిగ్గా. సరే పోనీలే అనుకున్నాను... ఇందాక ఫోన్ చేసి, బస్‌స్టాండ్‌లో దిగాక, మా ఇంటికి బస్సులోనో, ఆటోలోనో కాకుండా కారులో వచ్చేయండి... ఎందుకంటే, మా చుట్టాలు ముందు నాకు చిన్న చూపు. కావాలంటే డబ్బులు నేనిస్తాను అన్నాడు. అంతే నాకు ఒళ్ళు మండిపోయింది. అందుకే ఇక్కడే దిగిపోదాం! అతను ఆస్తి, ఆడంబరం కోసం ప్రాకులాడే వాడిలా కనిపిస్తున్నాడు... ఈ సంబంధం మనకి నప్పదు, అందుకే మనం వెనక్కి వెళ్ళక తప్పదు. అక్కడి వరకూ వెళ్ళి మనవాడికీ... ఆ అమ్మాయికీ ఆశ పెట్టడం ఎందుకు? అందుకే ఇక్కడితో దిగి వెనక్కి పోదాం!" అన్నాడు.

"అలా అనుకున్నా, అతనితో మనకేం పని చెప్పండి? మనకి అమ్మాయి ముఖ్యం. మన వాడు అతన్ని పెళ్ళి చేసుకుంటాడా ఏవిటీ? అయినా తెలుగు సినిమాలు మీరు చూడటం లేదూ, అహంకారి అయిన తండ్రి, తన కూతురిని ఎంత ప్రేమగా చూసుకున్నా, హీరోయిన్ మాత్రం, తనకి నచ్చినవాడికి డబ్బు, చదువు, పనీ పాటా లేకపోయినా... వాడ్ని ప్రేమించి మరీ పెళ్ళి చేసుకుంటుంది. చివరికి తప్పక ఆ తండ్రే అల్లుడి దారికి వస్తాడు. కనుక మీరు ధైర్యంగా ఉండండి. ఎందుకంటే, మనవాడికి అంతో ఇంతో ఆస్తి, మంచి ఉద్యోగం వగైరా




ఉన్నాయి... కాదని మీరు ఇలానే వంకలు పెడుతూ కూర్చుంటే, రేపు మనవాడు పెళ్ళి, పెటాకులు లేకుండా... ఒంటరి తాటాకులా మిగిలిపోతాడు." మూతి వంకర తిప్పుతూ చెప్పింది.

కొడుకు బిక్కుబిక్కుమంటూ తండ్రి వంక చూసి...

"నాన్నా! ఎందుకైనా మంచిది, అమ్మ చెప్పే ముక్కలు నీ చెవిలో వేసుకో నాన్నా..." బ్రతిమాలుతున్నట్టుగా అన్నాడు.

"దాని చెప్పు ముక్కలు నేను చెవిలో వేసుకోవాలా?.. ఇంకా నయం మెడలో వేసుకోమన్నావు కాదు!" అసహనంగా అరిచాడు.

"నువ్ సరిగా వినలేదు, చెప్పు ముక్కలంటే, కాలికి వేసుకునేవి కాదు నాన్నా!..." అని ఇంకేదో అనేంతలో...

"నువ్వు నోరుముయ్యి! నాకర్థమయింది. నీకర్థం కానిదేవిటంటే... తండ్రి అలా ఉంటే కూతురు మాత్రం వేరేలా ఎలా ఉంటుందీ... ఇదేం సినిమా కాదు. నేనూ ఇలా అనుకునే మీ అమ్మని పెళ్ళి చేసుకుని... నా జీవితానికి నేనే ముళ్ళబాట వేసుకుని... ఇప్పుడు నాలో నేనే కుళ్ళిపోతున్నాను... అందుకే చూస్తూ, చూస్తూ నీ జీవితం అలా కానివ్వను." కొడుకు వంక ప్రేమగా చూస్తూ అన్నాడు.

దాంతో అతని కొడుకు, తల్లి వంక చూస్తూ

"అమ్మా నాన్న చెప్పే ముక్కలు నిజమే అనిపిస్తోంది. నాన్న మాట వింటే బావుంటుందేమో నమ్మా!" అన్నాడు బిత్తర చూపులు చూస్తూ.

ఇంతలో బస్టాప్ వచ్చి బస్సు ఆగగానే, ముగ్గురూ వెంటనే దిగిపోయారు.

"ఇదిగో! ఈ బస్సు కాకపోతే వచ్చే బస్సులో వెళదాం. ఇది నీ పెళ్ళి, మీ నాన్న చెప్పాడనో నేను చెప్పాననో కాదు. నీ నిర్ణయం కూడా ముఖ్యమే!... నాంచకుండా నువ్వేమనుకుంటున్నావో ధైర్యంగా చెప్పు!" అంది కొడుకు వంక చూస్తూ.

ఇంతలో పిల్ల తండ్రి ఫోన్ చేసి...

"ఏవిటండీ ఆలస్యం బస్సులో వస్తే ఇలాగే ఆగి... ఆగి వస్తుంది. ఓ కారు బుక్ చేసుకోవాల్సింది. స్టేటస్‌కి తగ్గట్టు ఉండాలి మనం..." అని ఇంకేదో చెప్తుండగానే...

వాళ్ళమ్మాయి కాస్త విసుగ్గా... "అయినా అలాంటి లోక్లాస్ చీప్ సంబంధం ఎవరు రికమెండ్ చేసారు డాడీ నీకు?..." అని ఆమె మాట్లాడుతుండగానే...

సుబ్బారావ్ కొడుకు ఫోనందుకుని కట్ చేసాడు. ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నాడు సుబ్బారావ్.





# పదానందం-31

కూర్పు: పోపూరి విశ్వనాథ్, 9133197111



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | ■ | 4 | |
| | ■ | | ■ | 5 | 6 | | ■ |
| 7 | | | | ■ | | ■ | 8 |
| | ■ | | ■ | 9 | | | |
| ■ | 10 | ■ | 11 | | ■ | ■ | |
| ■ | | ■ | ■ | 12 | | 13 | |
| 14 | | | 15 | ■ | ■ | | ■ |
| | ■ | ■ | 16 | | | | |

## ఆధారాలు:

**అడ్డం:**

1. తాళి (5)
4. పేదవాని పడక (2)
5. ఇంద్రజాలం (3)
7. కురూపి సరిగాలేదు (4)
9. వినయం, నమ్రత (4)
11. చర్మం (2)
12. దయ (4)
14. గడగడా ఆపకుండా చెప్పెయ్యడం (4)
16. అతిగా ఆకలివేస్తే ఇలా అని తింటారు (5)

**నిలువు**

1. చర్చలు, సమాలోచనలు (4)
2. చెదరిన ఒక తెలుగు సంవత్సరం (4)
3. పైకొచ్చిన గొంతు (2)
4. కొండెం (2)
6. కాపు (3)
8. కావలసినది (4)
9. సజ్జ (3)
10. బావులు, చెరువులలో పేరుకున్న మన్ను(3)
13. క్షామం (3)
14. చాలా దగ్గరి స్నేహితులు ఇలా పిలుచుకుంటారు (2)
15. పైకొచ్చిన గోమాత (2)


**సమాధానం వచ్చే సంచికలో!**

### గత సంచిక సమాధానం

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 శ్రీ | కా | 2 రం | ■ | 3 చే | ■ | ■ | 4 బ్ర |
| కృ | ■ | సా | ■ | 5 వ | 6 కా | ల | తు |
| 7 ష్ణ | తృ | గ | 8 మృ | ■ | ల | ■ | కు |
| దే | ■ | ■ | 9 దం | డ | యా | త్ర | ■ |
| 10 వ | స | ■ | గం | ■ | ప | ■ | 11 వి |
| రా | ■ | 12 అ | ■ | 13 మొ | న | గా | డు |
| 14 యు | లు | తి | సృ | ల | ■ | ■ | ద |
| లు | ■ | వ | ■ | 15 క | ల | క | ల |

ఇంటిల్లిపాదిని అలరిస్తున్న
ఏకైక తెలుగు హాస్యమాస పత్రిక
హాస్యానందం
చందాదారులుగా చేరండి!
నవ్వే లక్షణం మీ సొంతం చేసుకోండి!!

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P




**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001. fone: 9676444548

Hasyanandam April-2026 RNI No. APTEL 08387/01/1/2003-TC

